

నెల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో తుది పోరు మొదలైంది. ఎన్నికల విధుల్లోని ఉద్యోగులు ఓటు వేసే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. 8వతేదీ వరకు ఓటు వేసుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఒక ఫెసిలిటేషన్ కేంద్రంలో ఆయా నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో తొలిరోజే ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. జిల్లాలో మొత్తం 19,834 పోస్టల్ బ్యాలెట్‌లను జారీ చేయగా మొదటి రోజు 6251 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 31.50 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా కందుకూరులో 35.04 శాతం, నెల్లూరు సిటీలో 33.56 శాతం మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు.

ఉద్యోగులను తమ వైపు తిప్పుకునేందుకు అధికార పార్టీ నేతలు ప్రలోభాల వల విసురుతున్నారు. ఆదివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ఉద్యోగులను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు పడరానిపాట్లు పడ్డారు. జిల్లావ్యాప్తంగా ఒక్కో ఓటుకు రూ.2500 నుంచి 5వేల వరకు ఇచ్చినట్లు తెలిసింది. అయితే, చాలామంది ఉద్యోగుల అధికార పార్టీ నేతల తాయిలాలను సున్నితంగా తిరస్కరించి, తమ మదిలో ఉన్న వారికే ఓటు వేసినట్లు సమాచారం.



ప్రలోభాల వల!

- రూ.5వేల వరకు పలికిన పోస్టల్ బ్యాలెట్ ఓటు
- కేంద్రాల వద్దే మోహరించిన వైసీపీ నాయకులు
- డబ్బు తీసుకునేందుకు వెనకాడిన ఉద్యోగులు
- తొలిరోజునే 31.50 శాతం పోలింగ్ నమోదు
- ఈ నెల 8వ తేదీ వరకు అవకాశం

రూ.5వేల దాకా పంపిణీ

ఉద్యోగు లను ప్రలో భ పెట్టేం దుకు వైసీపీ నేతలు ప్రయత్నాలు చేశారు. పలు చోట్ల ఓటుకు రూ.2500 నుంచి రూ.5 వేల వరకు పంపిణీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల్లో రూ.5 వేల వరకు ఇవ్వగా, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, నెల్లూరు సిటీ, కందుకూరు ప్రాంతాల్లో రూ.3 వేల వరకు పంపిణీ చేసినట్లు ప్రచారం నడుస్తోంది. అయితే గడిచిన ఐదేళ్లుగా ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన ఉద్యోగులు చాలా చోట్ల డబ్బులు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదని సమాచారం. దీన్నిబట్టి పోస్టల్ బ్యాలెట్‌లో కూటమి అభ్యర్థులకు మెజారిటీ దక్కే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఆడ, మగవారికి ఒకే క్యూలైను, కనీసం కూర్చొనేందుకు కుర్చీలు లేక, తాగేందుకు నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

● కనీస వసతులు లేక..

కందుకూరు/కావలి : ఫెసిలిటేషన్ సెంటర్లలో కనీస వసతులు కల్పించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పురుషులు, మహిళలకు ఒకే క్యూలైను ఏర్పాటు చేశారు. మరోవైపు కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అంతేగాక మండుతున్న



ఆత్మకూరులో నేలపై కూర్చొని ఉన్న మహిళా ఓటర్లు

ఎండలకు తడారుతున్న గొంతును తడుపుకుందా మనుకున్నా మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేదని ఉద్యోగులు వాపోయారు. ఇంత దారుణంగా ఫెసిలిటేషన్ సెంటర్లలో ఏర్పాట్లు ఉంటాయని ఊహించలేదని కందుకూరులో ఓ మహిళా ఉద్యోగి వాపోయారు. కందుకూరులో మూడు ఫెసిలిటేషన్ సెంటర్లు ఉండగా అన్నిచోట్లా ఇదే పరిస్థితి. ఇక కావలిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 5 ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పాఠశాలకు వెళ్లే మార్గంలో రహదారులు మూసివేసి కేవలం ఓటర్లను



కావలిలో ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణ్

తొలిరోజున పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం	పోలైనవి	శాతం
నెల్లూరు సిటీ	2419	812	33.56
నెల్లూరు రూరల్	4304	1372	31.08
కందుకూరు	1635	573	35.04
కావలి	2933	870	29.06
ఆత్మకూరు	2352	706	30.01
ఉదయగిరి	2336	711	30.43
సర్వేపల్లి	1268	387	30.52
కోవూరు	2587	820	31.69
మొత్తం	19,834	6251	31.50

మాత్రమే పోలీస్‌లు అనుమతించారు. పోలింగ్ సరళిని కలెక్టర్ హరినారాయణ్ పరిశీలించారు. అయితే పోలింగ్ సెంటర్ల దగ్గరలో రాజకీయ నాయకులు చేరి ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమం చేపట్టారు. కాగా, ఉద్యోగుల్లో మెజారిటీ మంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు తెలిసింది.



కోవూరు సభలో ప్రసంగిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

బాగా ఆలోచించి ఓటేయండి !

● కోవూరు సభలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

కోవూరు, మే5: రాష్ట్ర ప్రజలు బాగా ఆలోచించి ఓటేయాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కోరారు. స్థానిక బజారుకూడలిలో ఆదివారం జరిగిన ఏపీ న్యాయయాత్ర సభలో ఆమె మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటుతున్నప్పటికీ పది ఫ్యాక్టరీలు కూడా రాలేద న్నారు. ప్రత్యేకహోదా కోసం చంద్ర బాబునాయుడు, జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నించలేద న్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే తనతో సహా అందరూ కూడా ప్రత్యేక హోదా వస్తుందని విశ్వసించారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందని దుయ్యబట్టారు. జగన్మోహన్‌రెడ్డి ఒకటి కాదు మూడు రాజధానులన్నారు. ఒక్కటన్నా రాజధానిగా నిలిచిందా ? అంటూ ప్రశ్నించారు. రైతుల సంక్షేమాన్ని జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేక పోయారని చెప్పారు. ఐదేళ్లపాటు రాష్ట్రానికి జగన్ ఏమి చేశారని ప్రశ్నించారు. గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నారా ? అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించాల్సిందిగా కోరారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి కొప్పుల రాజు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా లభిస్తుందన్నారు. ప్రధాన మంత్రిగా రాహుల్‌గాంధీని ఎన్నుకోవాలన్నారు. కోవూరు అసెంబ్లీ అభ్యర్థి నారప రెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడారు. కోవూరు ఎన్నికల మేనిఫెస్టోను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆవిష్కరించారు.



సభకు హాజరైన ప్రజలు

వందకు పైగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల గల్లంతు

● ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం

ఆత్మకూరు, మే 5 : ఆత్మకూరు నియోజకవర్గంలో 100 మందికిపైగా ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గల్లంతయ్యాయని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. ఫారం-12లో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల ఓట్ల గల్లంతు, సొంత నియోజకవర్గంలో కాకుండా మరోచోట ఓటు కేటాయించారని ఆరోపించారు. ఈ విషయాన్ని తాము జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన దేశాల మేరకు ఆత్మకూరు రిటర్నింగ్ అధికారి మధులత పోలింగ్ కేంద్రానికి వచ్చి విచారించినట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికి ఓటు హక్కు కల్పిస్తామని, అలాంటి వారికి ఫారం-12 అందజేస్తామని తెలిపారన్నారు. ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లే గల్లంతైతే, రెగ్యులర్ ఓట్లలో అవకతవకలు చోటుచేసుకుంటే ఏం చేయాలనే అంశంపై టీడీపీ నేతలతో చర్చించి పరిశీలిస్తామని తెలిపారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న ఆనం రామనారాయణరెడ్డి

కట్టుదిట్టంగా నీట్

- విద్యార్థుల అణువణువు పరిశీలన
- ఆరు కేంద్రాల్లో నిర్వహణ
- 3,996 మంది హాజరు

నెల్లూరు (విద్య), మే 5 : ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యు యేట్ (నీట్-యూజీ) ప్రవేశ పరీక్షను జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వ హించారు. ఉదయం 11 గంటల నుంచే తనిఖీలు ప్రారంభించి 1.30 గంటల వరకు విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి ప్రవేశానికి అవకాశం కల్పించారు. ఆఫ్‌లైన్ పద్ధతి లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరిగింది. జిల్లాలోని అక్షర విద్యాలయం, వీఆర్ ఐపీఎస్, గీతాంజలి ఇంజనీరింగ్, కావలి ఆర్ఎస్ఆర్ ఇంజ నీరింగ్ కళాశాల, తడలోని పద్మావతి సీబీఎస్ఈ, గూడూరు శ్రీచైతన్య ఇంగ్లీష్‌మీడి యం పాఠశాల కలిపి మొత్తం ఆరు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. 3,996 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.



వెంకటాచలం: అక్షర విద్యాలయం పరీక్ష కేంద్రంలో రూమ్ నెంబరు తెలుసుకుంటున్న అభ్యర్థులు

మెటల్ డిటెక్టర్‌తో పరిశీలన...

నీట్ పరీక్షకు కఠిన నిబంధనలు అమలు చేయడంతో విద్యార్థులు అనుకున్న సమ యాని కంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అధికారులు విద్యార్థులు ధరించిన దుస్తులు, ఆభరణాలు, పరికరాలు, చెప్పులు సహా అన్నింటినీ పరిశీలించిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, జామర్లు ఏర్పాటు చేయడమేకాక పటిష్టమైన మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు నిర్వహిం చారు. హ్యాండ్ బ్యాగులు, బెల్టులు, టోపీ, డెబిట్, క్రెడిట్ కార్డులతో సహా చేతికి వాచీ ధరించినా సరే పరీక్ష రాయడానికి నిరాకరించారు. కాళ్లకు చెప్పులు మాత్రమే వేసుకుని పరీక్షకు హాజరు కావాలనే నిబంధన ఉండటంతో విద్యార్థులు కూడా ముందు జాగ్రత్త లు తీసుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షను ఎంతో ప్రశాంతంగా రాశామని, ప్రశ్నపత్రం కూడా సులభంగానే ఉందని పలువురు విద్యార్థులు తెలియచేశారు.

ఆంధ్రజ్యోతి సిత్రాలు



హమ్మయ్య.. చెట్టు నీడ దొరికింది!

లింగసముద్రం : చినపవని గ్రామంలో చెట్టుకింద ప్రసంగిస్తున్న కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వర రావు



ఇదే మన గుర్తు!

సైదాపురం : మర్లపూడిలో సైకిల్ సింబల్ చూపిస్తూ ప్రచారం చేస్తున్న వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ



గొడుగు ఉన్నా ఏం సెగ

వెంకటాచలం : అనికేపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి

దాచమని చెప్పిందెవరు ?



పొదలకూరులో సెబ్ అధికారులు అరెస్టు చేసిన మద్యం కేసులోని నిందితులు

- మద్యం నిల్వలపై విచారణ ముగిసినట్టేనా ?
- పంపిణీ చేసిన, దాచినవారు అరెస్టు
- జిల్లాలో ఎన్నిచోట్ల డంప్‌లకు సరఫరా చేశారో..?
- సెబ్ అధికారుల ఎంక్వైరీపై ఎన్నో సందేహాలు

నెల్లూరు(క్రైం). మే 5: సార్వత్రిక ఎన్నికల వేళ సెబ్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ విధుల్లో నిర్లక్ష్యం వహించారని డీజీపీ, ఐజీ, ఎస్పీ స్థాయి అధికారులను సైతం విధుల నుంచి పక్కన పెడుతోంది. అయితే జిల్లాలో మాత్రం సెబ్ అధికారుల తీరు మారడం లేదని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో మద్యం డంప్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరంతరం తనిఖీలు చేపట్టాలని పదే పదే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే సెబ్ అధికారులు మాత్రం 10, 20, 30 మద్యం సీసాలను బెల్ట్ దుకాణాల్లో అమ్ముతు న్నారని పట్టుకొని చూపడం మాత్రం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. జిల్లాలోని పొదలకూరు, ఇందుకూరుపేట సెబ్ పోలీసు స్టేషన్ల పరిధిలో ముందుగా అందిన సమాచారం మేరకు ఎన్నికల స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేసి, భారీగా మద్యం డంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై కేసులు నమోదు చేసిన సెబ్ అధికారులు తూతూ మంత్రంగా విచారణ చేస్తున్నారని ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో మద్యం నిల్వ ఉంచిన ప్రాంతాలకు చెందినవారు, ఉపయోగించిన వాహనాలకు చెందిన వారిపై కేసులు నమోదు చేశారు. కేసుల విచారణలో భాగంగా ఇందుకూరుపేట సెబ్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో విధులు నిర్వహించే ముగ్గురు సిబ్బందిని అరెస్ట్ చేశారు. అలాగే పొదలకూరు సెబ్‌స్టేషన్ పరిధిలోని రెండు మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే ఐదుగురిని ఆదివారం అరెస్ట్ చేయగా, మరొకరు పరారీలో ఉన్నారు.

● ఎవరు ఆదేశిస్తే సరుకు ఇచ్చారు ?

ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసే సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా బెల్ట్‌లో మద్యం విక్రయించేవారికి పది నుంచి 30 క్వార్టర్‌లలోపు మద్యాన్ని విక్రయిస్తుంటారు. ఎన్నికల వేళ ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నా వందల కేసుల మద్యం ఇచ్చేంత ధైర్యం ఉంటుందా... ? అసలు ఎవరు ఆదేశిస్తే ఇన్ని కేసుల మద్యం దుకాణాల నుంచి బయటకు వెళ్లింది... ? స్థానిక నాయకుల అండతోనా... లేక ఎక్సైజ్‌లోని ఉన్నతాధికారుల భరోసాతోనా....? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే మద్యం డంప్‌లు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయని, ప్రధానంలో పల్లెల్లో అధికంగా ఉన్నాయని తెలిసినా స్థానిక పోలీసులు, సెబ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే వేలాది కేసుల మద్యాన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి తరలించారని తెలుస్తోంది. మొత్తం మీద జిల్లాలో మద్యం ఏరులై పారుతున్నట్లు ఎన్నికల స్క్వాడ్‌కు పట్టుబడ్డ మద్యం నిల్వలే చెబుతున్నాయి.



సోమశిలలో శిథిలావస్థకు చేరిన హైలెవల్ పంప్‌హౌస్



కంపచెట్ల నడుమ సోమశిల హైలెవల్ పైలాన్



తుప్పుపడుతున్న పైపులు

- పురోగతి లేని పనులు
- శిథిలావస్థకు నిర్మాణాలు, సామగ్రి
- మెట్ట గ్రామాల్లో సాగునీటి ఇబ్బందులు

హైలెవల్ కెనాల్...
అంతు లేని జాప్యం !

అనంతసాగరం, మే 5 : సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు... రైతుల ప్రయోజనాలే తనకు ముఖ్యమన్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రగల్భాలు పలికారు. అయితే జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన హైలెవల్ ప్రాజెక్టుపై మాత్రం ఆయన శీత కన్ను వేశారు. ఈపనులకు అంకురార్పణ జరిగి పదేళ్లు పూర్తయింది. ఇంత వరకు సమగ్రరూపం దాల్చలేదు. దీంతో సోమశిల ప్రాజెక్టు నిర్దేశిత రైతాంగం నీటి ఇబ్బందులతో అల్లాడుతున్నారు. ప్రతి ఎన్నికల్లో హైలెవల్ కెనాల్ పనుల ప్రస్తావనతో నాయకులు ఓట్లు దండుకుంటారు. కానీ ఈ పనులు పూర్తిచేసి నీటి అవసరాలు తీర్చేలా చర్యలు మాత్రం తీసుకోరు.

దుర్భిక్షంలో ఆత్మకూరు, ఉదయగిరి

సోమశిల జలాశయానికి కూతవేటు దూరంలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలు ఉన్నా తాగు, సాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. 2013లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సోమశిలలో హైలెవల్ కెనాల్ నిర్మాణానికి పైలాన్ ప్రారంభించారు. ఈప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.1,560 కోట్లు అవసరమని ప్రతిపాదనలు చేశారు. విడతల వారీగా నిధులు మంజూరు చేసి పనులు చేసేలా హైలెవల్ కెనాల్ రూపకల్పన జరిగింది. అయితే 2016 వరకు పనుల ఊసేలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం హైలెవల్ కెనాల్ నిర్మాణంపై చొరవ చూపింది. మొదటి విడత కింద రూ. 527 కోట్లు మంజూరు

ప్రచార అస్త్రం

చేసి పనులు ప్రారంభించింది. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈపనులకు రీటెండరింగ్ చేసి రూ. 459 కోట్లకు కుదించింది. అయితే అదిశగా ప్రారంభమైన పనులు అనుకొన్న మేరకు పూర్తికాలేదు. ఆతర్వాత 2020 నవంబరు 9న సెకండ్ ఫేస్ పనులను తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. రెండో దశకింద ఆత్మకూరు నియోజయకర్గంలో 10,103, ఉదయగిరి నియోజకవర్గంలో 36,350 ఎకరాలకు నీరు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు పనులు పూర్తికాలేదు. నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. సోమశిల నుంచి 550 క్యూసెక్కులు తరలించి హైలెవల్ కెనాల్ కింద ఏర్పాటు చేసిన రిజర్వాయర్లలో నీటి నిల్వ చేసి నీరు ఇచ్చే కార్యక్రమంలో అడ్డంకులు తొలగలేదు. రిజర్వాయర్లు నిర్మిస్తున్న ప్రాంతాల్లో భూములు తీసుకొన్న రైతులకు నష్టపరిహారం చెల్లింపులు జరగలేదు. ఈ విషయంపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. దీంతో హైలెవల్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఆగిపోయాయి. ఈక్రమంలో ఉదయగిరి నియోజకవర్గం లోని దుత్తలూరు, వరికుంటపాడు, సీతారాంపురం, వింజమూరుతోపాటు, ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు, అనంతసాగరం, ఆత్మకూరు రైతులు సాగునీటి ఇబ్బందులతో అల్లాడుతున్నారు.

ఆత్మకూరు ఉదయగిరి



త్రైత సిద్ధాంతంపై ప్రచారం

వరికుంటపాడు, మే 5: దుత్తలూరు త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం జడదేవి, అలివేలుమంగాపురం, తూర్పు బోయమడగల గువ్వాడి, కాంచెరువు గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రత్నం, కె.నరసింహులు, యం.నాగమ్మ, వై.మహేందర్, డి.రమణమ్మ, వెంకటసుబ్బమ్మ, డి.రమణమ్మ, ఎన్.రత్నమ్మ, ఎన్.ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

● ఓటేసేందుకు ఉద్యోగులకు తప్పని అవస్థలు



ఆత్మకూరులో వేచి ఉన్న ఉద్యోగులు

ఆత్మకూరు, మే 5: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమైంది. నియోజకవర్గ పరిధిలో 2352 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉంటే మొదటిరోజు 706మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అధికసంఖ్యలో ఉద్యోగులు పోలింగ్ కేంద్రానికి తరలిరావడంతో ఉద్యోగులకు అవస్థలు తప్పలేదు. ఒక ఓటు వేసేందుకు 10నిమిషాలు సమయం పడుతుండటంతో గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. కొందరు ఓటర్లు వరుసలో నిలోచలేక కింద కూర్చుండిపోయారు. దానికితోడు తాగునీటి కొరత ఏర్పడడంతో ఇబ్బందులు పడ్డారు. పలువురు ఓట్లు గల్లంతు కావడంతో ఆవేదనకు లోనయ్యారు. సమాచారం అందుకున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మధులత పోలింగ్ సెంటర్ వద్దకు వచ్చి పరిశీలించారు. వాటర్ బాటిల్ బాక్స్‌లను తెప్పించి అందుబాటులో ఉంచారు. ఓట్లు గల్లంతు విషయమై పరిస్థితిని చక్కదిద్దారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు లేని ఉద్యోగులకు ఫారం- 12 దరఖాస్తులను అందజేసి తిరిగి ఓటుహక్కు కల్పిస్తామని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని వెల్లడించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఈ నెల 8వరకు ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు.

ఓటు వేసిన 711 మంది ఉద్యోగులు

ఉదయగిరి రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఎన్నికల విధులకు వెళ్లనున్న ఉద్యోగులు 711మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలో 2,336 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 సమర్పించని ఉద్యోగులు ఎన్నికల డ్యూటీ వేసినట్లు పత్రాలు చూపి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సరళిని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్, వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు పరిశీలించారు. సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు ఉన్నారు.



ఉదయగిరిలో ఓటేసేందుకు వచ్చిన ఉద్యోగులు

పరిశీలనకే పరిమితం!

● 2018లో టీడీపీ హయాంలోనే ఉదయగిరికి పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీ మంజూరు
● వైసీపీ పాలనలో భూమిపూజకు నోచుకోని వైనం
● నిధులు మంజూరైనా ముందుకు రాని కాంట్రాక్టర్లు
● నిరాశకు గురవుతున్న మెట్టప్రాంత వాసులు



భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలం

ఉదయగిరి రూరల్, మే 5: జనవికాస యోజనం పథకం కింద మైనార్టీ విద్యా ర్థుల సంక్షేమం కోసం పాల్‌టెక్నిక్, ఐటీఐ కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాల, వసతి గృహాలు ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్రం60, రాష్ట్రప్రభుత్వం 40శాతం నిధులతో భవ నాలు నిర్మిస్తామన్నారు. ఇందుకోసం మండలంలోని కొండాయపాళెం పంచాయతీ పరి ధిలోని గంగిరెడ్డిపల్లి గ్రామ సమీపాన 533 సర్వే నెంబర్‌లోని 35ఎకరాలు కేటాయిం చారు. ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు సైతం స్థలాన్ని ఎంపిక చేసి పరిశీలించారు. అయితే స్థల పరిశీలనకే అధికారులు, ప్రజాప్రతినిధులు పరిమితమయ్యారు. ఐదేళ్లయినా భూమిపూజ లేదు. భవన నిర్మాణాలకు పునాదులు తీయలేదు. కేవలం జంగిల్ క్లియరెన్స్ చేసి వదిలిపెట్టారు. మెట్టప్రాంతంలో కళాశాలలు, వసతిగృహాలు ఏర్పాటు చేస్తే తమ పిల్లల భవిష్యత్తు బాగుపడడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశపడ్డ వారికి నిరాశే మిగిలింది.

టీడీపీ హయాంలో మంజూరు:

2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మైనార్టీ విద్యార్థుల సంక్షేమం కోసం ఐటీఐ కళాశాలలు, పాల్‌టెక్నిక్, రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు వసతిగృహాలు మంజూరయ్యాయి. జిల్లాకు ఒక్క ప్రాజెక్టు మంజూరు కాగా వెనుకబడిన ప్రాంతమైన ఉదయగిరికి కేటాయించారు. అప్పట్లో గంగిరెడ్డిపల్లిలో స్థల పరిశీలన చేసి చదును చేయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి నిర్మాణాలను మరుగున పడేసింది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే ఈ భవనాల నిర్మాణాలను ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించింది. అందులో భాగంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.47కోట్లు నిధులను మంజూరు చేసింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుతో బిల్లులు వస్తాయో రావో అన్న ఆలోచనలో అధికారులు టెండర్లు పిలిచినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. జంగిల్ క్లియరెన్స్‌కు సైతం బిల్లులు చెల్లించలేదనే ఆరోపణలు న్నాయి.



భవన నిర్మాణాలకు కేటాయించిన స్థల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అప్పటి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే (ఫైల్)

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ ఇక్బాల్‌లను సన్మానిస్తున్న ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు మే 5: టీడీపీ అధినేత చంద్రబాబు నాముడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. ఆదివారం శ్రీధర్ గార్డెన్స్‌లో నియోజకవర్గస్థాయి ముస్లింమైనార్టీల ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మైనార్టీ కార్పొరేషన్ నుంచి రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఇమామ్‌లకు నెలకు రూ.10వేలు, మౌజ్‌లకు రూ.5వేలు, హజ్‌యాత్రకు రూ.లక్షతోపాటు మసీదుల నిర్వహణకు నెలకు రూ.5వేలు, నూర్‌బాషాలకు రూ.100కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆత్మకూరు అభ్యర్థిగా తనను, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఏఎస్‌పేటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు షాదీమంజిల్స్ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, తాళ్లూరి గిరినాయుడు, ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆనం కైవల్యారెడ్డి, దావా పెంచలరావు, చంద్రా వెంకటసుబ్బానాయుడు, చల్లా రవికు మార్‌రెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ షేక్ గౌస్‌బాష పాల్గొన్నారు. అనంతరం రాత్రి ఆత్మకూరులోని పంటవీధి, చల్లావీధిలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం సమక్షంలో పట్టణ టీడీపీ నాయకుడు చల్లా రవికుమార్ ఆధ్వర్యంలో గడ్డం వెంకటేశ్వర్లు, మనోహర్, పెంచలయ్య, పవన్‌కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, కార్తీక్, వినయ్‌లు పార్టీలో చేరారు.

ఏఎస్ పేట: బీజేపీ రాష్ట్ర కమిటీసభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి స్థానిక నాయకులతో కలిసి బీసీకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చెంచురెడ్డి, నీలం వీరబ్రహ్మం, వెంకటేశ్వరనాయుడు ఉన్నారు.

అనంతసాగరం: టీడీపీ విజయంతో రాష్ట్రానికి బంగారు భవిషత్తు ఉంటుందని పార్టీ మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత తెలిపారు. ఆదివారం కొత్తపల్లి పంచాయతీలోని వడ్డిపాలెం, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను గెలిపిం చాలని కోరారు. టీడీపీ అమలు చేసే గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, నర్సారెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రదీప్‌నాయుడు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు



జెండా ఊపి ప్రచార రథాలను ప్రారంభించిన ఎన్నికల నోడల్ ఆఫీసర్ పద్మావతి, చిత్రంలో కలెక్టర్ హరినారాయణన్

ఓటు హక్కు ప్రచార రథాల ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), మే 5: ప్రతిఒక్కరూ ఈనెల13న తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ రూపొందించిన ప్రచార రథాలను ఆదివారం నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఎన్నికల నోడల్ ఆఫీసర్ పద్మావతి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్ పాల్గొని మాట్లాడారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికి ఓటు వినియోగంపై అవగాహన కల్పించేలా ప్రచారరథాలను ప్రారంభించామన్నారు. గతంలో జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో తక్కువ ఓటింగ్‌శాతం నమోదైందని, ఓటింగ్ శాతం పెంచేందుకు ఈ రథాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

● బెలూన్ ప్రారంభం

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఓటర్లను చైతన్య పరిచేలా మస్కట్‌ను, బెలూన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నోడ్ అధికారులు బాపిరెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైం). మే 5: నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాల, వీఆర్ కళాశాల్లో ఆదివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ పరిశీలించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పోలింగ్ రోజున పోలింగ్‌బూత్‌లకు 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇతరులెరూ ఉండకుండా చూడాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

ఉరేసుకుని బాలిక బలవన్మరణం

నెల్లూరు(క్రైం). మే 5: ఓ బాలిక తన ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నెల్లూరు బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మధురా నగర్‌లో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు, మధురానగర్‌కి చెందిన మమత నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో వంటపని చేస్తుంది. ఆమెకు ఒకటే కుమార్తె. ఆ బాలిక ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. శనివారం మమత కావలి వెళ్లడంతో బాలిక తన ఇంట్లోని ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి ఇంటికి వచ్చిన మమత తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా రాలేదు. లోపల గడిపెట్టి ఉండటాన్ని గమనించి స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లింది. కుమార్తె ఫ్యానుకు వేలాడుతూ కనిపించడంతో భోరున విలపిస్తూ స్థానికుల సహాయంతో కిందకు దించింది. అనంతరం సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు బాలిక అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఈ మేరకు మమత ఆదివారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మద్యం డంప్ కేసులో నిందితుల అరెస్టు

● ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్‌లకు రిమాండ్

పొదలకూరు, మే 5 : మండలంలోని విరువూరు రైస్ మిల్లులో పది రోజుల కిందట భారీగా మద్యం డంప్ కేసులో ఏడుగురు నింది తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఈనెల 17వరకు వారికి రిమాం డ్ విధించినట్లు సెబ్ సీఐ వెంకటరావు ఆది వారం పత్రికా ప్రకటనలో తెలిపారు. గత నెల 24న ఎఫ్ఎస్‌టీ మెంబర్స్ ఎస్వీ సుబ్రహ్మణ్యం, వై శ్రీనివా సులు, వీడియోగ్రాఫర్స్ భరత్‌కి సమాచారం రావడంతో రైస్ మిల్లులో తనిఖీ చేపట్టారు. విచారణలో 2649 మద్యం సీసాలను తాటిపర్తి, సూరాయ పాలెంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలకు సంబంధించినవిగా సెబ్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో తాటిపర్తి మద్యం షాపులో పనిచేసే ఇద్దరు సేల్స్ మెన్ చిర్రా విజయరామిరెడ్డి, కుప్పాల వెంకటవినోద్‌కుమార్‌ను అలాగే సూరాయపాలెం మద్యం షాపులో పనిచేసే సూపర్‌వైజర్ మల్లెల అనీల్, సేల్స్‌మెన్ గణేశం విష్ణు వర్ధన్‌రెడ్డి, ఉయ్యాల కృష్ణ, రైస్‌మిల్లు యజమాని చిర్రా రాజగోపాల్‌రెడ్డిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి 17వరకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. అయితే మరో సూపర్‌వైజర్ పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. కాగా, వారిని పూర్తి స్థాయిలో విచారించి వారి వద్ద నుంచి ఎవరు మద్యం కొనుగోలు చేశారు. వారి చేత ఎవరుకొనుగోలు చేయించారో వారిని వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అప్పసముద్రం పాఠశాలలో చోరీ

● రూ.1.27 లక్షల సామగ్రి అపహరణ

ఉదయగిరి రూరల్, మే 5: అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో చోరీ జరిగిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల గది తాళాలు పగలగొట్టి అందులో నాడు-నేడు పథకం కింద మంజూరైన 24 సీలింగ్ ఫ్యాన్‌లు, వైర్ కాయిల్స్, ఏసీ, పాత విద్యుత్ మోటార్ చోరీ చేశారు. శనివారం గ్రామస్థులు చోరీ జరిగిందని గుర్తించి సమాచారాన్ని ప్రధానోపాధ్యాయులు విజయకుమార్ సమాచారం అందిం చారు. ఆయన పాఠశాలకు వెళ్లి పరిశీలించి రూ.1.27 లక్షల వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు ఉదయగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

సోమశిలలో 8.082 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 5: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు ఆది వారానికి జలాశయంలో 8.082టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువడెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి

బుచ్చిరెడ్డిపాళెం, మే 5: కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతిచెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి బుచ్చి టోల్‌గేట్‌సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం బేతంచర్ల పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ చెరుకుముడి మద్దిలేటి స్వామి (47) కృష్ణపట్నం పోర్టు నుంచి బొగ్గులోడుతో కర్నూలు వెళ్తూ బుచ్చి టోల్‌గేట్ సమీపంలో టిఫిన్ చేసే నిమిత్తం లారీని రోడ్డుపక్కన నిలిపి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొంది. దీంతో మద్దిలేటి స్వామి మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లారీ డ్రైవర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	152
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	266
స్కిన్‌లెస్	296
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6784
వెండి కిలో ధర	రూ. 82,600
వెండి ఒక గ్రాము	రూ. 84.60

ఉదయగిరి అభివృద్ధి టీడీపీకే సాధ్యం

● ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్



ఉదయగిరి : టీడీపీ యువత ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న కాకర్ల సురేష్

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 5: అన్ని రంగాల్లో వెనుకబడిన ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీకే సాధ్యమని ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. కొత్తపేట, వెంగన్నపాళెం, తెడ్డుపాడు, వడ్డిపాళెం, నర్రవాడ, నాయుడుపల్లి గ్రామాల్లో ఆయన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కూటమి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఉదయగిరి తలరాత మారాలంటే సైకిల్ గుర్తుపై ఓటువేయాలన్నారు. 40ఏళ్లుగా ఉదయగిరిని పాలిస్తున్న ఓ కుటుంబం అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆ కుటుంబం బూటకపు మాటలు చెబుతోందని, అవి నమ్మితే మన బతుకులు మారవన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని, లేదంటే అంధకారం నెలకొంటుందన్నారు. నియోజకవర్గంలో తాగు, సాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు వలసల నివారణకు పరిశ్రమలు స్థాపిస్తామన్నారు. ఉదయగిరి.. మేకపాటి వారి జాగీరు కాదని, తెలుగుదేశం అడ్డగా మారుబోతుందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనంమైందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పి శాశ్వతంగా ఇంటికి పంపాలన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో తనతో పాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి,మల్లంపాటి గురవయ్య నాయుడు, మాదాల రామ చంద్ర, చీదర్ల మల్లికార్జున, శ్రీకుర్తి రవీంద్రబాబు, చేజర్ల భాస్కర్ రెడ్డి, కాకర్ల మధు, చల్లా ప్రసాద్, శనివారపు సుబ్బారెడ్డి, తాళ్లూ రు దయానందం పాల్గొన్నారు.

నేడు కాకర్ల ఎన్నికల ప్రచారం

సోమవారం వెంకటంపేట, పాపంపల్లి, నందిపాడు, రెడ్లదిన్నె, రాచవారిపల్లి, భైరవరంలో ఉదయగిరి ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.

ఉదయగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే ఉదయగిరి అభివృద్ధికి మలుపు అవుతుందని టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు టీడీపీ అనుబంధ సంఘాలు, యువత ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి మేని ఫెస్టోను రూపొందించిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే యువ తకు 20లక్షల ఉద్యోగాలతో పాటు నిరుద్యోగభృతి అందజేస్తామన్నారు. ఒక్క అవకాశమని చెప్పి సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక యువత ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం దివాళా తీసిందన్నారు. ఉదయగిరి ప్రాంతంలో వలసల నివారణకు పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో పాటు సాగు, తాగునీటి కష్టాలు తీర్చి మెట్టను డెల్టా చేయడమే ధ్యేయమన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుం దన్నారు. తొలుత స్థానిక ఏబీఎం చర్చిలో క్రైస్తవ సోదరులతో ప్రార్థనల్లో పాల్గొన్నారు.

60కుటుంబాలు టీడీపీలో చేరిక:

ఉదయగి రిలోని సినిమాహాలు వీధి, కృష్ణంపల్లిలో 60 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నాయి. వారికి కాకర్ల సురేష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, కాకర్ల సురేఖ, సయ్యద్ సందానీ, ఓబులరెడ్డి, బాబు పాల్గొన్నారు.

అర్లపడియలో ఎన్నికల ప్రచారం

అర్లపడియలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి టీడీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌ల సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంటింటా తిరిగి కూటమి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మహిళలకు అభివాదం చేస్తున్న కాకర్ల సురేష్



వరికుంటపాడు: టీడీపీ కరపత్రాలు ఇస్తున్న నాయకులు

వరికుంటపాడు: ఉమ్మడి నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించాలని తూర్పుకొండారెడ్డిపల్లిలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ ఏనుగు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచారు. రాష్ట్ర భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని ఎన్నికల్లో పార్టీ విజ యానికి సహకరించాలని ఓటర్లను అభ్యర్థించారు. యరగూటి మాలకొండారెడ్డి, మందిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక రాజుగారి వీధి, బీసీ కాలనీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని సర్పంచ్ భాగ్యకుమారి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు నిర్వహించారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సీఎంగా చంద్రబాబు నాయుడిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవర వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, షెక్ బాబు, తోట మాల్యాద్రి, వార్డు మెంబర్ తోట మనోజ్, తమ్మిశెట్టి రమణయ్య, ఖాజమొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నూకనపల్లిలో ఇంటింటా ప్రచారం

కలువాయి, మే 5: సైకిల్‌గుర్తుపై ఓటు వేసి వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆదివారం నూకనపల్లిలో టీడీపీ నాయకులు కండే ప్రసాద్, చల్లా రాధాకృష్ణారెడ్డి కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.



నూకనపల్లిలో ఇంటింటా ప్రచారంలో టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్ : నియోజకవర్గంలో 2,41,677 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,19,929మంది పురు షులు, 1,21,738 మంది మహిళ లు, 10 మంది ఇతరులు ఉన్నారు.

ఉదయగిరిలో ఓటర్ల సంఖ్య

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సీతారామపురం	9,490	9,670	0	19,160
ఉదయగిరి	15,166	15,098	0	30,264
వరికుంటపాడు	12,822	13,101	2	25,925
దుత్తలూరు	11,164	11,426	1	22,591
వింజమూరు	16,562	16,805	2	33,369
కొండాపురం	17,226	17,364	1	34,591
కలిగిరి	18,804	19,157	2	37,963
జలదంకి	18,695	19,117	2	37,814

కావలి కందుకూరు

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

● జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

కావలి/కందుకూరు, మే 5: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ విధులకు కేటాయించిన ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ కోరారు. ఆదివారం ఆయన కావలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, కందుకూరు పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్‌కు హాజరయ్యే ప్రతి ఉద్యోగి తమకు కేటాయించిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో విధిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు. ఇంకా ఎవరైనా ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ కాపీ పొంది ఉండి ఫారం-12 ఇవ్వకుండా ఉంటే ఇప్పుడు వారు కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు.


కందుకూరులో హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టరు, సబ్ కలెక్టరు

● భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటివద్ద ఓటు ప్రక్రియను కావలిలో ఓ వయో వృద్ధురాలు, కందుకూరు పట్టణంలోని తూర్పుపాలెం ప్రాంతంలో వారి వారి ఇళ్లల్లో ఓటు హక్కును వినియోగించుకోగా ఈ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. మైక్రో అబ్జర్వర్, పోలింగ్ అధికారుల సమక్షంలో వారు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. వృద్ధుల ఓటింగ్‌లోనూ గోప్యత పాటించడంతో పాటు వారు స్వేచ్ఛగా తమ అభిమతంకు అనుగుణంగా ఓటువేసేలా చూడాలని సూచించారు. ఆయన వెంట కందుకూరు సబ్ కలెక్టరు జి.విద్యాధరి ఉన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి : బొల్లినేని

కలిగిరి, మే 5: టీడీపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. ఆదివారం కలిగిరిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకొని చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి భుజస్కంధాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరు చంద్రమౌళి, ఊసా మల్యాద్రి, కాకు మహేష్, కొండపల్లి వెంకటరావు, నిశ్శంకర సురేష్ పాల్గొన్నారు.

● మండలంలోని వెలగపాడు పంచాయతీలో ఏపీస్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు దేవనబోయిన వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ గాలి రమణయ్య, కట్టా వెంకటేశ్వర్లు, కర్నాటి ప్రభాకర్, గన్నమనేని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీ పరిశ్రమ ఏమైందో?

● టీడీపీ హయాంలో ఒప్పందం

● వైసీపీ ప్రభుత్వం తీరు నచ్చక వెనక్కు తగ్గిన సంస్థ ప్రతినిధులు

● రైతులకు ప్రయోజనం, ఉపాధిని పెంచే ఇండిస్ట్రియల్‌పై ప్రకటన ఏది ?

కందుకూరు, మే 5 : రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న ఏషియన్ పల్ప్ అండ్ పేపరు పరిశ్రమ (ఏపీపీ) కార్యాచరణ దిశగా ఇప్పటికైనా అడుగులు పడేనా...? అని కందుకూరు ప్రాంత ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. వేలాదిమందికి ఉపాధి అవకాశాలతోపాటు లక్షలాది రైతుకుటుంబాలకు లబ్ధి చేకూరుస్తుందని ఆశించిన ఏపీపీని వైసీపీ ప్రభుత్వం పారదోలిందని, రానున్న ప్రభుత్వంలోనైనా ఆ పరిశ్రమ అడుగులు ముందుకు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

● **గుర్తింపు పొందిన పరిశ్రమ**

అంతర్జాతీయంగా ఎంతో గుర్తింపు పొందిన ఏపీపీ పరిశ్రమను రామాయపట్నం పోర్టు పరిధిలోని రావూరు గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధులు 2019లో టీడీపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. అప్పట్లో చంద్రబాబునాయుడు పరిశ్రమ ఏర్పాటుకు పైలాన్‌ను కూడా ఆవిష్కరించారు. అప్పట్లో జరిగిన ఒప్పందం ప్రకారం 2500 ఎకరాల్లో భారీ పేపరు పరిశ్రమను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఏపీపీ ముందు కొచ్చింది. దేశంలోనే ఆ సంస్థ ఏర్పాటు చేస్తున్న మొట్ట మొదటి పరిశ్రమగా దీన్ని పేర్కొన్నారు. 3.5 బిలియన్ డాలర్లు (అప్పటి డాలర్ మారకం విలువ ప్రకారం 24 వేల కోట్ల రూపాయలు) ఇక్కడ పేపరు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. ఈ పరిశ్రమలో పేపరుతో పాటు పల్ప్‌ను కూడా తయారు చేసి ఎగుమతి చేస్తామని వారు తెలి పారు. పేపరు, పల్ప్ తయారీకి అవసరమైన ముడిసరుకు యూకలిప్టస్, సుబాబుల్, వెదురు కర్ర లభ్యత ఏపీలోనే గణనీయంగా ఉన్నందున ఈ రాష్ట్రాన్ని ఎంచుకున్నట్లు ఏపీపీ ప్రతినిధులు వెల్లడించారు. పేపరు పరిశ్రమను 20 నెలల కాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. అంతేకాక ఈ పరిశ్రమలో 4 వేల మందికి ప్రత్యక్షంగా, 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయని, ఆ అవకాశాలన్నీ స్థానికులకేనని కూడా ప్రకటించారు. దీంతో తాము సాగు చేస్తున్న జామా యిల్, సుబాబుల్ కర్రకు గిట్టుబాటు ధర లభిస్తుందని, ధరలో సగానికిపైగా రవాణా ఖర్చులకే పోతున్న తరుణంలో ఏపీపీ ఏర్పాటైతే తమకెంతో మేలు జరుగుతుందని నెల్లూరు, ప్రకాశం జిల్లాల రైతులు ఆశించారు. అయితే ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏపీపీ ప్రతినిధు లకు సహకారం అందించలేదు. జగన్మోహన్‌రెడ్డి అండ్ కో అనుసరిస్తున్న విధ్వంసకర వైఖరిని గమనించిన ఏపీపీ ప్రతినిధులు పరిశ్రమ ఏర్పాటుపై తమ ఆలోచనను మార్చు కుని వెనక్కు తగ్గారు. అయితే రానున్న రోజుల్లో రాష్ట్రంలో తిరిగి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైతే పాత ఒప్పందం మేరకు ఏపీపీ ప్రతినిధులు ముందుకొచ్చే అవకాశాలు ఉన్నాయన్న ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది.


సీఎంగా చంద్రబాబునాయుడు ఆవిష్కరించిన ఏపీపీ పరిశ్రమ పైలాన్ (ఫైల్)

ఈ అవకాశం మళ్లీ మళ్లీ రాదు!

● వలస ఓటర్ల చార్జీల పేరుతో రూ.లక్షల వసూళ్లు

● అవాక్కవుతున్న అభ్యర్థుల ప్రతినిధులు

లింగసముద్రం, మే 5 : ఎన్నికల పుణ్యమా అని గ్రామస్థాయిలో రాజకీయ నేతల పంట పండుతోంది. మంచి తరుణం మించి పోవును.. ఇలాంటి అవకాశం మళ్లీ మళ్లీ రాదన్నట్టుగా గ్రామ స్థాయి నాయకులు వలస ఓటర్లను దూరప్రాంతాల నుంచి రప్పించే పేరుతో అభ్యర్థుల ప్రతినిధుల నుంచి చార్జీల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఇదే మంచి సమయం అనుకున్నారో ఏమో దూర ప్రాంతాలలో ఉన్న వారి పేర్లతో పాటు, గ్రామాల్లో ఉన్న ఓటర్లను కూడా దూర ప్రాంతాల్లో ఉన్నట్టుగా చూపించి లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ జాబితాలు చూసి ఆయా పార్టీల నేతల ప్రతినిధులు అవాక్కవుతున్నారు. ఇవ్వకుంటే ఏమవుతోం దనని వారు అడిగినంత నేతల ప్రతినిధులు కిక్కురుమనకుండా ఇస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాలలో వందల సంఖ్యలో పేర్లు రాసి ఇస్తున్నారు. దీంతో ఒక్కో గ్రామానికి అదనంగా కనీసం రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.

కూటమి మేనిఫెస్టోతోనే వైసీపీ చేతులెత్తేసింది

కావలి, మే 5: ఎన్డీఏ కూటమి మేనిఫెస్టో, వైసీపీ మేనిఫెస్టోను చూసిన ప్రజలు కూటమికి జైకొడుతుండటంతో వైసీపీ చేతులెత్తేసిందని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి తెలిపారు. కావలి వీపీఆర్ కార్యాలయంలో ఆదివారం ఆయన జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బాసాయివిఠల్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేబ్రహ్మానందం, ఎంపీ అభ్యర్థి వీపీఆర్ సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు పార్టీల మేనిఫెస్టోలు చూసి ప్రజలు ఎవరికి ఓట్లువేయాలో ఒక నిర్ణయానికి వచ్చారన్నారు. కావలిలో జగనన్న ఇళ్లలో ఎమ్మెల్యే చేసిన దోపిడీ అందరికీ తెలిసిందేనన్నారు. వైసీపీ తరుపున పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిల బాగోతం అందరికీ తెలుసన్నారు. ప్రజలు ఆలోచించి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కావలిలో మెగా రక్తదానం

కావలి, మే 5: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో టీం సేవియర్స్ సభ్యులు ఆదివారం కావలిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించి వంద మంది దాతలు రక్తదానం చేశారు. వారిని నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడారు. 53వ సారి రక్తదానం చేసిన ఉపాధ్యాయుడు బొడ్డు మాల్యాద్రి, 30వ సారి రక్తదానం చేసిన ఆర్టీసీ మెకానిక్ శ్రీనివాసుల రెడ్డిలను అభినందించారు. ఈ రక్తదాన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ రవిప్రకాష్, టీంసేవియర్స్ అధ్యక్షుడు ప్రనీత్, రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ హరినారపరెడ్డి పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలి

కొండాపురం : ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం కోసం టీడీపీ నాయకులు ఆదివారం ప్రచారం చేపట్టారు. నేకునాంపేటలో టీడీపీ నాయకులు పాలంకి మనోహర్, ఎమ్ లక్ష్మీనారాయణరెడ్డి, పాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెంలో దామా మహేశ్వరారవు, కుంకు మోహనరావుల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీచేశారు.

చంద్రబాబు సీఎం అయితేనే యువతకు ఉపాధి

● కందుకూరు ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు


కందుకూరు : టీడీపీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఇంటూరి

లింగసముద్రం, మే 5 : రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే యువతకు ఉపాధి దొరుకుతుందని కందుకూరు కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండలంలోని చినపవని, అన్నెబోయినపల్లి గ్రామాలలో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే దివి శివరాంతో కలసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నాగదేశ్వరరావు, దివి శివరాంల సమక్షంలో చినపవనిలో వైసీపీకి చెందిన కొమ్మి లక్ష్మీనారాయణ, కొమ్మి వెంకటప్రసాద్, దామా చిన బ్రహ్మయ్య, పిడతల మాల్యాద్రి, పిడతల కిషోర్‌బాబు, శెట్టిపల్లి మాల్యాద్రి, శెట్టిపల్లి మాలకొండయ్య, గుండెమడుగుల చిన్నబ్బాయితో పాటు మరో 10 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.మాల్యాద్రి, సోంపల్లి మనోహర్, యు నరసింహారావు, కె.నాగేశ్వరరావు, ఎం చౌదరి, పి బుచ్చయ్య, జనసేన నాయకుడు ఇనకొల్లు శ్రీనవాసులు పాల్గొన్నారు. అలాగే లింగసముద్రం టీడీపీ కార్యాలయంలో ఆర్ఆర్ పాలెంకు చెందిన వైసీపీ నాయకులు చింతగుంపల సుబ్బారావు, చొప్పర శ్రీనివాసులు, మరో ఐదుగురు, బలిజపాలెంకు చెందిన వార్డు సభ్యుడు నాయుడు రత్తయ్య టీడీపీలో చేరారు. మాజీ సర్పంచు చంద్ర తిరుపతయ్య, రొడ్డా నాగేశ్వరరావు, కిలారి మల్లికార్జున పాల్గొన్నారు.

కందుకూరులో కొనసాగుతున్న వలసలు

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాంల సమక్షంలో ఆదివారం పలు గ్రామాల వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కండువాలు వేసుకున్నారు. కందుకూరు మండలం మహదేవపురం నుంచి గుళ్లా మాలకొండయ్య, వైస్ సర్పంచు నర్రా వెంకటేశ్వర్లు, చింతా కోదండం, బెజవాడ పిచ్చయ్య, చిట్టా వెంకటరావు, దామా శ్రీను, దామా సురేష్, కట్టా ప్రసాదు, కందుకూరు చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ఫణిదపు రోశయ్య, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ గుళ్లా కృష్ణయ్య, దామా కృష్ణయ్య సహా పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు చిట్టా హరికృష్ణ, ఉన్నం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు మండలం ఆత్మకూరు గ్రామం నుంచి నక్కా కొండలరావు, ఓగూరు శ్రీనివాసరావు తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమరనేని రాములు, బెల్లం కృష్ణమోహన్, బండి వెంకటసుబ్బయ్య, నాళం నారాయణరావు పాల్గొన్నారు.

● కందుకూరు పట్టణంలోని 18వ వార్డుకు చెందిన సయ్యద్ ఫిరోజ్, అలీ, సాహల్, రఫి, మహబూబ్‌బాషా, బబ్లు, నాయబ్, ఖాదర్, ఆసిఫ్, తన్నీరు నరసింహం తదితరులు చంటి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మున్సిపాలిటీ పరిధిలోని శామీరపాలెం గ్రామం నుంచి బెజవాడ వెంకటేశ్వర్లు, పువ్వాడి కృష్ణ, గూటూరి మాధవరావు, తదితరులు టీడీపీలో చేరారు. స్థానిక నాయకులు తల్లపనేని రవీంద్ర, షరీఫ్, మునీర్, రసూల్‌బాషా, సుభాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి మత్స్యకార కుటుంబాలు

ఉలవపాడు : మండలంలోని చాకిచర్ల పంచాయతీ పరిధిలోని చిన్నపట్టపుపాలెం గ్రామానికి చెందిన 50 మత్స్యకార కుటుంబాలు ఆదివారం జువ్విగుంట యలమందయ్య ఆధ్వర్యంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వారికి పసుపు కండువాలు కప్పి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనని ఎంపీగా మేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. గ్రామానికి చెందిన తోట రామూర్తి, కోడూరు శ్రీనులు పార్టీకి మద్దతు తెలపగా, నాయకులు మిరియం మల్లికార్జున, సుదర్శి శ్రీనివాసులు, ఎందేటి శ్రీనివాసులు, తాటితోటి రవి, సుదర్శి కళ్యాణ్, సన్నిబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరి సౌజన్య ప్రచారం

కందుకూరు : ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేస్తున్న నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని కోరుతూ ఇంటూరి సౌజన్య ఆదివారం కందుకూరు మండలం, పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కొండికందుకూరు, బొడపాటివారికొష్టాలులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించి చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి చేకూరనున్న లబ్ధిని వివరిస్తూ టీడీపీ అభ్యర్థుల విజయం కోసం ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈదర నరసయ్య, చెంచురామయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, మెండా గోవిందు, మెండా ప్రసాదు, బి.అనిల్, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ పాల్గొన్నారు. కందుకూరు పట్టణంలోని సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. షేక్.రఫి, మల్లెల రమణయ్య, నిడమనూరి మాల్యాద్రి, ఎం.సాయికృష్ణ, షేక్ కరీముల్లా పాల్గొన్నారు.


కందుకూరు : ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య


ఉలవపాడు : చినపట్టపుపాలెం వాసులతో నాగేశ్వరరావు

ఇంటూరి కోసం విశ్వబ్రాహ్మణ సంఘం..

కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలకు మద్దతుగా జిల్లా విశ్వబ్రాహ్మణ సాధికార సమితి ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వంలో అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. చిలకపాటి మధుబాబు, ఇలాపాక శివప్రసాద్‌ఆచారి, ఎం వెంకటరమణాచారి పాల్గొన్నారు.

● ఇంటూరి, వేమిరెడ్డిలకు మద్దతివ్వాలని కోరుతూ కందుకూరులో బ్రాహ్మణ బంధువుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిరాజు మురళీమోహన్, నారాయణం రాధాకృష్ణ, గుంటూరు పద్మనాభశర్మ, తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ కూటమికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులు మున్సిపాలిటీ పరిధిలోని ఆనందపురం ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వర్ల దేవదాసు, కిట్టు, కోటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తాం.. అవకాశమివ్వండి!


కావలి : వేమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ శ్రేణులు


అల్లూరు : కావ్య కృష్ణారెడ్డికి దిష్టితీసి స్వాగతం పలుకుతున్న మహిళ

● కావలి ఎన్నికల ప్రచారంలో వీపీఆర్, కావ్య, బీద

కావలి, మే 5: అభివృద్ధి చేస్తాం... ఒక్క అవకాశం ఇవ్వండని నెల్లూరు ఎంపీ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని 4,5,8 వార్డుల్లో కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీపీఆర్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా పోలింగ్‌బూత్‌లో బటన్ నొక్కేటప్పుడు రెండు సెకన్లు ఆలోచించకపోతే ఐదేళ్లపాటు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి ఈనెల 14 తర్వాత ఎక్కడుంటాడో కనిపించడని, కనీసం ఫోన్ కూడా ఎత్తరన్నారు. ఇక కావలి ఎమ్మెల్యే సంగతి మీకు చెప్పనక్కరలేదని, మాకన్నా మీకు బాగా తెలుసునని అన్నారు. రాష్ట్రంలో ఉన్న వైసీపీ అరాచక, దుర్మార్గపు పాలనను తరిమి కొట్టాలని బీద రవిచంద్ర కోరారు. కావలి అభివృద్ధికి కంకణం కట్టుకుని ఉన్నామని, అందరం కలిసి కావలిని అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన అన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని కావలి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి దగుమాటి వెంకట (కావ్య) క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, ఆయా వార్డుల టీడీపీ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశారు

అల్లూరు : వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. మండలంలోని పడమర గోగులపల్లి, తూర్పు గోగులపల్లి పంచాయతీల్లో ఆదివారం కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి, జనసేన కావలి ఇన్‌చార్జి అలహరి సుధాకర్, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌లతో కలసి రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పల్లెప్రాంతాన్ని అభివృద్ధి చేసింది టీడీపీ పరిపాలనలో చంద్రబాబునాయుడు అన్నారు. అటువంటి పల్లెలు నేడు తాగునీటి కోసం రోదిస్తున్నాయన్నారు. పడమర గోగులపల్లిలో తాగునీటి వసతులు ఏర్పాటు చేసుకునేందుకు పైప్‌లైన్లు వేసిన ఏడాది వరకు బిల్లులను మంజూరు కానీయకుండా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అడ్డుకున్నాడని, ఆ సమయంలో అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన నెల రోజులకు బిల్లులు మంజూరు చేశారన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి దోచేసుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనిచెప్పుకునే స్థాయికి ఎదిగాడన్నారు.

రాజధాని లేని రాష్ట్రం ఏపీ

రాజధానిలేని రాష్ట్రంగా దేశంలో ఆంధ్రప్రదేశ్ మారిపోయిందని కావలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. ఏసీ రూముల్లో కూర్చొని బటన్ నొక్కుడుకు పరిమితమైన ముఖ్యమంత్రి మనకుండడం దౌర్భాగ్యమన్నారు. రాముడు లాంటి చంద్రబాబుని వదిలేసి రావణుడు లాంటి ముఖ్యమంత్రిని తెచ్చిపెట్టుకొని నేడు అనుభవిస్తున్నామన్నారు. నూతనంగా ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ చట్టాని తెచ్చి నూతన పద్ధతిలో రిజిస్ట్రేషన్లు అంటూ కొత్త దోపిడీకి తెరలేపాడని విమర్శించారు. ఈ పద్ధతి ద్వారా కేవలం జెరాక్స్ కాపీలను యజమానికి ఇచ్చి ఒరిజినల్ పత్రాలను ప్రభుత్వం వద్దనే భద్రపరుస్తున్నామని మాయమాటలు చెప్పి మోసం చేసేందుకు సిద్ధపడిపోయారని విమర్శించారు. రీసర్వే ప్రక్రియ అంటూ పంటలకు దిష్టిబొమ్మలు ఏర్పాటు చేసినట్టు సర్వే రాళ్లపై తన బొమ్మను ఏర్పాటు చేసుకుని ఆనందపడుతున్నాడని దుయ్యబట్టారు. ఇద్దరు 420లు ఎంపీలు, ఎమ్మెల్యే అభ్యర్థులుగా వైసీపీ తరపున పోటీ చేస్తున్నారని, ఇద్దరు సేవా దృక్పథం కలిగిన తాను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టీడీపీ తరపున పోటీ చేస్తున్నామని, అభివృద్ధి ఎవరితో సాధ్యపడుతుందో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆట తిరుమల, తోట మహాలక్ష్మమ్మ, తోట శీనయ్య, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వీపీఆర్, కావ్య, బీదలను గజమాలతో సత్కరిస్తున్న నేతలు

కావ్య సోదరుడు ప్రచారం

బిట్రగుంట : బోగోలు మండలంలోని కోవూరుపల్లి పంచాయతీ, అంబేడ్కర్ కాలనీ, అల్లిమడుగు పంచాయతీ, కడనూతల గ్రామాల్లో ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఆదివారం కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచార నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందచేశారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్రహం, దాసు, రామోహన్‌రెడ్డి, నాటకరాణి శీనయ్య, భాస్కర్, రంగయ్య, తిరుపతి, పైడిహర్ష పాల్గొన్నారు.

అడుగడుగునా కోడ్ ఉల్లంఘన!

● ప్రతి ఇంటి ప్రహరీకి వైసీపీ స్టిక్కర్లు ● చోద్యం చూస్తున్న అధికారులు

ఉలవపాడు, మే 5 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ఇంటింటి ప్రచారంలో వైసీపీ శ్రేణులు బరితెగించి ఇళ్ల ప్రహరీ గోడలకు వైసీపీ అభ్యర్థులు, ఫ్యాన్ గుర్తు ఉన్న స్టిక్కర్లను అంటించారు. ఆదివారం ఉదయం కరేడు గ్రామంలో ఉదయం వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తు ఓటు అభ్యర్థనకే అనుమతులు ఉంటాయి. కానీ కరేడులో బహిరంగంగా వైసీపీ నేతలు ప్రచారంలో ఇళ్ల ప్రహరీ గోడలకు స్టిక్కర్లు అంటించి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. మండల ఎన్నికల అధికారులకు సమాచారం అందించినా ఎప్పటికో స్పందిచారని, అప్పటికే వైసీపీ శ్రేణుల ప్రచారం ముగించారని స్థానికులు తెలిపారు. ఇదే విషయమై స్థానికంగా ఉన్న టీడీపీ నేతలు సంబంధిత అధికారులపై భగ్గుమంటున్నారు. అధికారుల్లో ఇంకా వైసీపీ పట్ల స్వామి భక్తి పోలేదని, వారికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆధారలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు.


ప్రహరీ గోడపై అంటించిన వైసీపీ స్టిక్కరు

మాదిగల అభ్యున్నతికి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలి

కావలి, మే 5: మాదిగల అభ్యున్నతి కోసం ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మార్పీఎస్ నేతలు పేర్కొన్నారు. పట్టణంలోని ముసునూరు 14వ వార్డు అరుంధతీయవాడలో ఆదివారం వారు ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో ద్వారా జరిగే ప్రయోజనాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కిలగుంట ఏసురత్నంమాదిగ, ఏసుపోగు జయరాజు మాదిగ, కత్తి శివయ్యమాదిగ, మంద మహేష్‌మాదిగ పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి జన కేతనం



జలకలే!

మోసం గురూ!

● బోర్లు వేయక.. బావురమంటున్న రైతులు ! ● నామమాత్రంగా పథకం అమలు



బోర్లు వేసే యంత్రం



నెల్లూరు (జడ్పీ), మే 5: జిల్లాలోని రైతులకు సాగు నీరు అందించేందుకు వైఎస్ఆర్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం దాన్ని హామీలకే పరిమితం చేసింది. నామ మాత్రంగానే బోర్లు వేసి చేతులు దులుపుకుంది. దీంతో ఈ పథకం లక్ష్యం నీరుగారిపోయింది. ఫలితంగా సాగునీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. మాది రైతురాజ్యం అని చెప్పుకునే జగనన్న ఇందుకు ఏమి సమాధానం చెబుతారని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

అమలు కాని హామీలు

ఐదు ఎకరాలలోపు మెట్ట ఉన్న పేద రైతులకు ఉచితంగా బోర్లు ఏర్పాటు చేసి, బీడు భూములను సాగు భూములుగా మార్చుతామని, రైతులకు అండగా నిలుస్తామని గత ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గొప్పగా హామీలిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక జలకళ పథకాన్ని నామమాత్రంగా చేపట్టారు. జగన్ మాట ఇస్తే తప్పడు... అన్న నమ్మకంతో ఈ పథకానికి రైతులు పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. గత ఐదేళ్లలో జిల్లాలో కేవలం 2,497 బోర్లు మాత్రమే వేశారు. దీన్ని బట్టి రైతుల పట్ల వైసీపీకి ఎంత చిత్తశుద్ధి అర్థమవుతోంది.

వచ్చిన దరఖాస్తులు 11,418

వైఎస్ఆర్ జలకళ పథకానికి, జిల్లాలో 11,418 పేద రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలో ఆ పథకం ఊసే లేదు. ఆ తర్వాత బోర్లు వేసే యంత్రాలను కొనుగోలు చేసి నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేశారు. దీంతో బోర్లు వేస్తారని దరఖాస్తు చేసుకున్న రైతులంతా ఆశగా ఎదురు చూశారు. అయితే బోర్లు ఏర్పాటుకు సవాలక్ష నిబంధనలు విధించారు. ఈ క్రమంలో మూడేళ్లలో 2,497 బోర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. బోర్లు వేయాలంటే రైతుల దరఖాస్తులను జియాలజిస్టులు పరిశీలించారు. ఆ ప్రాంతంలో నీరు పడుతుందో... లేదో? పరిశీలించి ఆమోదం తెలియచేయాలి. ఆ తర్వాత ఆమోదించిన దరఖాస్తులను ఎంపీడీవోకు పంపాలి. అక్కడ మండల అధికారులు ఆ జాబితాను ఆమోదించాలి. ఆ తర్వాత జిల్లా అధికారులకు పంపి, వారి నుంచి ఆమోదం పొందాక బోర్లు వేయాలి. అయితే మండల స్థాయి అధికారుల పరిశీలనకే దరఖాస్తులు నోచుకో లేదు. దీంతో దరఖాస్తులు భారీగా వచ్చినా బోర్లు మాత్రం నామ మాత్రంగానే వేశారు. కాగా వేసిన బోర్లకు విద్యుత్ సౌకర్యం, మోటర్ ఏర్పాటు చేయక పోవడంతో ఎక్కువ శాతం బోర్లు నిరుపయోగంగానే మిగిలిపోయాయి.

బోర్లు వేశారు.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు !



ప్రభుత్వం అట్టహాసంగా వైఎస్ఆర్ జలకళ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే అర్హులైన వారికి బోర్లు వేయకుండా వైసీపీ అనుచరుల పొలాల్లోనే వేశారు. ఒకవేళ ఇతరుల పొలంలో బోర్లు వేసినా విద్యుత్, పంపుసెట్ సదుపాయాలు కల్పించలేదు.

- అలపాక పెంచల ప్రశాంత్, దండిగుంట, విడవలూరు మండలం

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	దరఖాస్తులు	వేసిన బోర్లు
ఆత్మకూరు	2720	882
కందుకూరు	1762	357
కావలి	614	321
కోవూరు	102	27
నెల్లూరు రూరల్	135	1
ఉదయగిరి	3220	201
సర్వేపలి	1587	628
వెంకటగిరి (కొంతభాగం)	1278	80
	11418	2497

నిధుల దుర్వినియోగం



వైఎస్ఆర్ జలకళ నిధులను పాలకులు దుర్వినియోగం చేశారు. పథకం నిర్వహణ పూర్తిగా నేతల కను సన్నల్లో అమలు చేశారు. రైతులను నిలువునా మోసం చేశారు.

- రామ్మూర్తి, విడవలూరు

పంపుసెట్ ఇవ్వలేదు...



జలకళ పథకం కింద 2021 డిసెంబరులో నా భార్య సుజాత పేరుతో బోరు, పంపుసెట్ మంజూరైంది. ఏడాదిన్నర క్రితం బోరు వేశారు. డబ్బులు కట్టి విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకున్నాం. పంపు సెట్ కోసం ఆత్మకూరు పీడీ కార్యాలయానికి పలుమార్లు తిరిగినా ఇంతవరకు ఇవ్వలేదు. ఇదేమని అడిగితే కాంట్రాక్టర్ వద్ద గోదాములో ఉన్నాయన్నారు. రేపోమాపో ఇస్తాం.. ఓపిక పట్టు.. అంటున్నారు.

- దుద్దుకూరు శేఖర్, రైతు పెగళ్లపాడు, మర్రిపాడు మండలం



ఎన్నికల్లో మెనూ..

నచ్చింది తిను !

● క్యాటరింగ్ సర్వీసులకు యమా గిరాకీ



ఎన్నికల వేళ.. కోరిన వంటకాలు వండి తీసుకొచ్చి వడ్డించే క్యాటరింగ్ సర్వీసులకు యమా గిరాకీ ఏర్పడింది. వందలాదిమంది కార్యకర్తలతోపాటు సభలు, సమావేశాలకు దండిగా జనం వస్తుండడంతో వారికి భోజనాలు ఏర్పాటు చేసేందుకు నేతలు క్యాటరింగ్ సేవలు వినియోగించుకుంటున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ప్రచారంలో తలమునకలయ్యే శ్రేణులకు బిర్యానీ, అల్పాహారం అందించేందుకు రోజూ ఆర్డర్లు ఇస్తున్నారు. చేయి తిరిగిన వంట మనుషులు చేసిన వంటకాలు మండలమంతా సరఫరా అవుతున్నాయి. కొందరైతే విందుతోపాటు మద్యం పంపిణీ చేస్తున్నారు. ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి పరిశీలిస్తే వారం రోజులుగా క్యాటరింగ్ సర్వీసులకు బాగా గిరాకీ పెరిగింది. ప్రచార సమయాల్లో ప్రత్యేకించి భోజనాలు తయారు చేయించే పరిస్థితి ఉండదు, కాబట్టి క్యాటరింగ్ వాళ్లకి ఆర్డర్లు ఇస్తున్నారు. టిఫిన్లు, భోజనం, బిర్యానీ, ఇలా అన్నింటికి కలిపి రోజుకు 500 నుంచి వెయ్యి ప్లేట్ల వరకు సిద్ధం చేసి పంపిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో ఆర్డర్లు వస్తుండడంతో సాధారణ ధరలకు బదులు కాస్త తగ్గించి ఇస్తున్నామని క్యాటరింగ్ నిర్వాహకులు చెబుతున్నారు.

- పొదలకూరు

గిరి బరిలో తొలి నారీ !



నామినేషన్ వేసిన అనంతరం ఎన్నికల అధికారి ఎదుట ప్రమాణం చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి పుష్పాంజలి(ఫైల్)

ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయగిరి నుంచి ఎందరో హేమాహేమీలు పోటీ చేసి, విజయం సాధించారు. అయితే ఒక్కసారి కూడా మహిళ ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన దాఖలాల్లేవు. ఏఒక్క పార్టీ కూడా వారికి అవకాశం ఇవ్వలేదు. ఈసారి జరిగే ఎన్నికల్లో మాత్రం బీఎస్పీ అభ్యర్థిగా క్రాకుటూరు పుష్పాంజలి పోటీ చేస్తున్నారు. ఆమెతోపాటు బరిలో 15 మంది ఉన్నారు. నియోజకవర్గంలో 2,41,861 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,20,108 మంది పురుషులు, 1,21,743 మంది మహిళలు ఉన్నారు. పురుషుల కంటే 1,635 మంది మహిళల ఓట్లే అత్యధికంగా ఉన్నారు. అయితే ఏ రాజకీయ పార్టీ కూడా మహిళకు టికెట్ కేటాయించలేదు. అసెంబ్లీలో ఉదయగిరి వాణిని నారీ ఎప్పుడు వినిపిస్తుందో వేచిచూడాల్సిందే.

- ఉదయగిరి



ర్యాలీకి వస్తా.. ఓటూ వేస్తా !

ఎన్నికలవేళ గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఏపార్టీ నాయకులు పిలిచినా కొంతమంది ర్యాలీలకు, ప్రచారానికి వెళ్తున్నారు. ఇదే విషయాన్ని కొందరు నాయకులు ప్రశ్నిస్తే మా ఓటు మాత్రం మీకే వేస్తామని చెబుతున్నారు. దీంతో అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఎటువంటి ఇబ్బంది ఉండరాదన్న ఉద్దేశంతోనే కొందరు అలా చెబుతున్నట్లు తెలిసింది. టీడీపీ, వైసీపీ నాయకులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఘనంగా స్వాగతం పలకాలన్న ఉద్దేశంతో గ్రామస్థాయి నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రచారానికి రావాలని కోరుతున్నారు. దీంతో ఇరుపార్టీలకు జనం తండోపతండాలుగా వస్తున్నారు. దీంతో వీరు ఎవరికి ఓటు వేస్తారో అన్న అయోమయంలో పార్టీల నాయకులు, అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ తరఫున ప్రచారానికి వెళ్తున్నా.. ఆ సమయంలో తమ ఓటు మీకేనని ఆ పార్టీ నాయకులకు ప్రజలు చెబుతున్నారు. ఈ క్రమంలో పోటీల్లో ఉన్న అభ్యర్థులు గ్రామాల్లోని ప్రజల నాడిని తెలుసుకునేందుకు సొంత సర్వేలు చేయించుకుంటున్నారు.

- వలేటివారిపాలెం

ఏనుగంత బలం..!



యువగళం

నా ఓటుకు ఏను గంత బలం ఉంది. ధైర్యంగా తొలి ఓటు వేస్తా. ఓటు అంటే ఐదేళ్ల పూలబాట. ఉచిత పథకాలకు ఎవరూ లొంగిపోరాదు. మాలాంటి యువత భవిష్యత్ గురించి ఆలోచించాలి. ప్రస్తుతం రంగురంగుల జెండాల మాయలో పడొద్దు. ప్రచారాలకు వచ్చిన నేతలకు ఒత్తాసు పలకొద్దు. బరితెగించి తిరుగుతున్న పాలక వర్గాలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలి. యువత అభివృద్ధికి పాటుపడేవారికే నా ఓటు.


- కన్నెమరకల వినయ్, మర్రిపాడు

బదిలీ పేరుతో ఓటర్ల డబుల్ ఎంట్రీ

● దొంగ ఓట్లకు పక్కా ప్లాన్ అంటూ ప్రచారం

● రెండుచోట్ల అవకాశం లేదంటున్న ఆర్వో

కావలి, మే5: కావలి నియోజకవర్గంలో దొంగ ఓట్లకు అధికార పార్టీ నేతలు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. ఇందులో భాగంగా బదిలీ ఓట్ల పేరుతో దొంగ ఓట్లను చేర్చారు. ఇందుకు అధికారులు, సిబ్బంది సహకరించారనే ప్రచారం ఉంది. కావలిలో సుమారు ఐదువేల వరకు దొంగ ఓట్లు చేర్చాలని పథకం రూపొందించగా, చివరకు రెండు వేలలోపే చేర్చినట్లు తెలుస్తోంది. ఓ ఓటును ఒక బూత్ నుంచి మరో బూత్‌కు మార్చాలంటే బీఎల్వోలు సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. ఓటు బదిలీ కావాలంటే దానికన్నా ముందు మీరు బదిలీ కోరే చిరునామాలో ఉన్నట్లు లిఖిత పూర్వక ఆధారాలు కావాలని 23వ వార్డుకు చెందిన బీఎల్వో ఒక వ్యక్తికి చెప్పారు. అదే 23వ వార్డు ప్రాంతంలో బదిలీ పేరుతో భారీగా రెండు చోట్ల ఓట్లు పొంది దొంగ ఓట్లను సిద్ధం చేశారు. ఉదాహరణకు షేక్ అఖిల్ అనే వ్యక్తి ఓటు 110 బూత్‌లో ఉంది. అయితే ఆయన బదిలీ పేరుతో అదే బూత్‌లో మరో ఇంటి అడ్రస్‌లో చేర్చు కోవాల్సిన అవసరం ఏముంది...? ఇది కేవలం అధికార పార్టీ ఒత్తిళ్లు, ఉన్నతాధికారుల సహకారంతో బీఎల్వోలు దొంగ ఓట్లు చేర్చారనే ఆరోపణలు ఉన్నాయి. బీఎల్వోలు కూడా ఎక్కువగా సచివాలయ సిబ్బందే ఉండటం, వారం తా ఆయా వార్డుల్లో వైసీపీ వార్డు ఇన్‌చార్జిలతో సఖ్యతగా ఉండడంతో వారు చెప్పినట్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. బదిలీ ఓట్లు ఎక్కడో మారుమూల గ్రామాల నుంచి వచ్చినవి కాదు. ఎక్కువగా పట్టణంలోని వెంగళరావునగర్ ఓటర్లు అదే ప్రాంతంలో బదిలీ ఓట్లు పొందారు. అలాగే పాతూరులో ఓటర్లు అదే ప్రాంతానికే బదిలీ పెట్టుకున్నట్లు జాబితాలో ఉన్న వివరాలను బట్టి తెలుస్తోంది. ఇవి బదిలీ ఓటర్లు అని.. ఒక చోట నుంచి మరో చోటకు బదిలీ అయిన తర్వాత రెండో చోట డిలెట్ చేసే లోపు ఎన్నికల కోడ్ వచ్చినందున వాటిని డిలిట్ చేయలేకపోయామని అధికారులు చెబుతున్నారు. అయితే డిలెట్ ఓట్ల వివరాలను పోలింగ్ కేంద్రాల్లో పీవోలకు అందచేస్తామని, ఒక వ్యక్తి రెండు పర్యాయాలు ఓటు వేసే అవకాశం లేదని వారంటున్నారు.



● రెండుచోట్ల ఓటు వేసే అవకాశంలేదు : ఆర్వో

బదిలీ పేరుతో డబుల్ ఎంట్రీ ఉన్న ఓటర్లు రెండు చోట్ల ఓటువేసే అవకాశం లేదని కావలి ఆర్వో శీనానాయక్ చెప్పారు. బీఎల్వోలు కూడా ఓటరు స్లిప్‌లు ఇంటింటికి పంపిణీ చేసేటప్పుడు బదిలీ ఓటర్లకు రెండో చోట ఉన్న ఓటు స్లిప్‌పై డిలెట్ అనిరాసి పెడ్తారని వివరించారు.


చెప్పేది వినాల్సిందే.!



అదండీ...

హలో... నేను.. మీ నియోజకవర్గ అభ్యర్థిని. ఈ ఎన్నికల్లో మీ ఓటు తప్పనిసరిగా మా పార్టీ గుర్తుపైనే వేయాలి. అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేస్తానని ప్రమాణం చేస్తున్నా.. అంటూ పలు అంశాలపై అభ్యర్థులు ప్రసంగిస్తున్నారు. ఇది ఏ సభలోనో, రోడ్‌షోలోనో కాదు... సెల్‌ఫోన్లలో... అది కూడా ఓటర్లు ఫోన్ ఎత్తి హలో.. అనగానే అవతలి వారు ఏకబిగువున మాట్లాడేస్తున్నారు. ఆ కాల్‌ను కట్టడి చేయడానికి వీలుండటం లేదు. ఇలాంటి కాల్స్ ప్రతిరోజు పది నుంచి పదిహేను వరకు వస్తున్నాయి. వీటి పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- పొదలకూరు




ఆత్మకూరులో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ (ఫైల్)

అన్నా క్యాంటీన్లపై అక్కసు !

● ఎత్తివేసే వరకు నిద్రపోని జగన్ ● పేదల కడుపులు కొట్టిన వైసీపీ

● ఇదేనా ప్రభుత్వ సంక్షేమం ?



అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం ప్రజలకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, మే 5 : ఈ రోజుల్లో ఎవరైనా రూ. 5లకే కడుపునిండా అన్నం పెడతారా..? ఎంత ధనికులకైనా మనసొప్పదు.. చేతులు రావు. అలాంటిది పేదవాడి కడుపు నింపడం కోసం టీడీపీ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రారంభించింది. రుచి, శుచిగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టి అన్నార్తుల ఆకలి తీర్చింది. వైసీపీ అధికారం లోకి రాగానే అన్నా క్యాంటీన్లకు రంగులు మార్చింది. పోనీ రంగులే కదా మారిస్తే.. మార్చింది... అనుకుంటే.. వాటిని కొనసాగించకుండా మూతేసింది. గత టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు పేదలకు అతితక్కువ ధరకే రుచికరమైన భోజనం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఆత్మకూరు నడిబొడ్డున ఉన్న మున్సిపల్ బస్టాండ్ సమీపంలో పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో అన్నకాంటీన్‌ను ఏర్పాటు చేశారు. పట్టణానికి వివిధ పనులపై వచ్చేవారు, పలుచోట్ల పని చేసే కార్మికులు, నిరుపేదలు ఆకలితో అల్లాడిపోకుండా ఉండాలని, వారి కడుపు నింపేలా దీన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు అన్న క్యాంటీను ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రతి రోజు రెండు వేల మందికిపైగా భోజనం చేసేవారు. అలాంటిది వైసీపీ ప్రభుత్వం రాగానే అన్న క్యాంటీన్లకు మంగళం పాడింది. అన్నార్తుల కడుపులు కొట్టింది. అన్నా క్యాంటీన్ భవనం ప్రస్తుతం సచివాలయంగా రూపాంతరం చెందింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం వస్తే అన్నా క్యాంటీన్ తెరుస్తారనే ఆశతో నియోజకవర్గ ప్రజలు ఉన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు వారు సిద్ధంగా ఉన్నారు.

నిన్నో పార్టీ... నేడో పార్టీ !

● రోజుకో కండువా మార్చుతున్న చోటా నేతలు



గతనెల 26న వైసీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరిన అలీ

ఎవరు ఎప్పుడు ఎక్కడ ఉంటారో అంతుపట్టడంలేదు. నిన్న ఓ పార్టీలో చేరితే... నేడు మరో పార్టీలోకి జంప్ అవుతున్నారు. పెద్దపెద్ద నేతలకే ఈ జంపింగ్‌లు తప్పడంలేదు. ఎన్నికల సమయంలో ఇలాంటివి సర్వసాధారణం. ఈ క్రమంలో ఉదయగిరి సినిమాహాల్ వీధికి చెందిన షేక్ అలీ అనే వ్యక్తి తనవర్గంతో గతనెల 26న వైసీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. ఇంతలో ఏమైందోఏమోకానీ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో ఆదివారం ఆయన మళ్లీ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలీకి, ఆయన అనుచరులకు కాకర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఔరా.. ఇదేమి రాజకీయం... అంటూ పట్టణ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.

- ఉదయగిరి రూరల్



జంపింగ్ జపాంగ్

ఆదివారం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీలో చేరిన అలీ

ఎన్నికల పర్వం

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

నెల్లూరు(సిటీ), మే 5 : ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఇందులో భాగంగా ఆదివారం నగరంలోని డీకే కళాశాల ఆవరణంలో సిటీ నియోజకవర్గానికి సంబంధించిన అనేక మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రక్రియను సిటీ ఆర్వో వికాస్ మర్మత్ పరిశీలించారు.

ఎన్డీఏ కూటమి విజయం తథ్యం

- జూన్ 4 నుంచి ఏపీలో ప్రజారంజక పాలన
- నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి



రోడ్ షోలో మాట్లాడుతున్న ఎన్డీఏ కూటమి రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 5 : ఏపీలో ఎన్డీఏ కూటమి విజ యం తథ్యమని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఆదివారం మండలంలోని పొట్టే పాళెంలో ఎన్నికల ప్రచార రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజావ్యతిరేకత స్పష్టంగా తెలుస్తోందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎక్కడ మీటింగ్ పెట్టినా జన సునామి కనిపిస్తోందని, ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారన్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రజలంతా సైకిల్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 4 నుంచి ఏపీలో చంద్రబాబు నాయకత్వంలో ప్రజారంజక పాలన మొదలవుతుందని తెలిపారు. ఆ తర్వా త మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను అమలు చేస్తార న్నారు. ప్రపంచం మెచ్చే విధంగా అందమైన రాజధానిని అమరావతిలో నిర్మించడం తథ్యమన్నారు. కాగా, వైసీపీకి రాజీనామా చేసిన ప్రసాద్, బుజబుజ నెల్లూరుకు చెందిన రమేష్ మిత్రబృందాన్ని ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట : కోటంరెడ్డి


ప్రచారంలో కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 5 : మహిళా సాధికారతకు ఎన్డీఏ కూటమి పెద్దపీట వేస్తుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. ఆదివారం నగరంలోని 10వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో ప్రజాదరణ పొందిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయస్సు వరకు మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, ఏడాదికి 3 సిలిండర్లు ఉచితం, పొదుపు సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు... ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. మహిళల స్వయం ఉపాధి కోసం రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు అందజేస్తారన్నారు. ప్రజలు నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకర్ల తిరుమల నాయుడు, వెంకట్రావు, సురేష్, వెంకట కృష్ణ, శ్రీనివాస యాదవ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతికి సూపర్‌సిక్స్ : వినోద్

నెల్లూరు (విద్య), మే 5 : పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతికే ఎన్డీఏ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ పథకాలను చేర్చినట్లు టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 47వ డివిజన్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛను, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు పింఛను, దివ్యాంగులకు రూ.6వేల పింఛను అందచేస్తారన్నారు. ప్రజలంతా టీడీపీకి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు కేతంరెడ్డి దేవి, కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళను ఓటు అభ్యర్థిస్తున్న కేతంరెడ్డి వినోద్‌రెడ్డి

జగన్‌ను ఓడించండి : గిరిజన సంఘాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 5 : రాష్ట్రంలోని గిరిజనులను అన్నివిధాల మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, వైసీపీకి ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కల్లూరు చిన్న పెంచలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. వైసీపీ అభ్యర్థి ఆదాల ఎప్పుడూ గిరిజనులను, వారి సంక్షేమం, అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో చెంబేటి ఉష, మాణిక్యాల మురళి, ధరణి పతి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెంచలయ్య

టీడీపీ యువనేత ఇంటిపై వైసీపీ నేతల దౌర్జన్యం

- వెంకటాచలంలో పోలీసుల పహారా

వెంకటాచలం, మే 5 : వెంకటాచలం గ్రామానికి చెందిన టీడీపీ ముస్లిం మైనార్టీ యువనేత షేక్ సిరాజుద్దీన్ ఇంటిపై వైసీపీ నాయకులు దౌర్జన్యం చేశారు. గ్రామంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న సిరాజ్ ఇంటికి ఆదివారం రాత్రి మాజీ జడ్పీటీసీ, వైసీపీ నేత మందల వెంకటశేషయ్య తన అనుచరులతో కలిసి వెళ్లి దౌర్జన్యం చేశాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సిరాజ్ తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి టీడీపీలో చేరి ఆతర్వాత ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడని మనస్సులో పెట్టుకున్న వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఇంటిపైకి వెళ్లి బెదిరించారు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు భారీగా అక్కడికి చేరుకున్నారు. దీంతో ఆప్రాంతంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయాన్ని స్థానిక నేతలు మాజీ మంత్రి సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసు బృందాలు చేరుకొని ఆదివారం రాత్రి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పహారా కాశారు.



ఘటనా స్థలిలో పహారా కాస్తున్న పోలీసులు

సెస్సు అందక.. అభివృద్ధి చెందక !


అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ సంస్థ నూతన భవన నిర్మాణం

- శిథిలావస్థలో జిల్లాలోని గ్రంథాలయాలు
- రూ.కోట్లలో బకాయిలు వేతనాల్లేక సిబ్బంది ఆవేదన

నెల్లూరు (సాంస్కృతికం), మే 5 : విజ్ఞాన దేవాలయాలు గ్రంథాలయాలు. వాటి అభివృద్ధి కోసం జిల్లా ప్రజలు వివిధ రూపాల్లో ఏటా 0.8 రూపాయల సెస్సు చెల్లిస్తున్నారు. ఈ సెస్సును ఇళ్ల పన్నుతో కలిపి పంచాయతీలు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు వసూలు చేస్తున్నాయి. అయితే వసూలు చేసిన ఆ సెస్సును జిల్లా గ్రంథాలయ సంస్థకు వారు చెల్లించడం లేదు. దీంతో గ్రంథాలయాలు అభివృద్ధి చెందడంలేదు.

● పట్టించుకోని ప్రభుత్వం

స్థానిక సంస్థలు ప్రజల నుంచి వసూలు చేసిన గ్రంథాలయ సెస్సును ఆ సంస్థకు జమ చేస్తున్నాయా? లేదా అని ఐదేళ్లుగా అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో స్థానిక సంస్థల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గ్రంథాలయాల అభివృద్ధికి మోకాలడ్డుతున్నారు. జిల్లాలో ప్రజల నుంచి వసూలు చేయాల్సిన గ్రంథాలయ సెస్సు పేరుకుపోయి దాదాపు రూ.42,36,29,731 మేరకు చేరింది. నేటికీ అవి వసూలు కాలేదు. ఉమ్మడి జిల్లాలో నెల్లూరు నగర పాలక సంస్థ సుమారు రూ.37కోట్లు, కావలి మున్సిపాలిటీ రూ.10కోట్లు, గూడూరు మున్సిపాలిటీ రూ.9కోట్లు, ఆత్మకూరు మున్సిపాలిటీ రూ.60లక్షలు, వెంకటగిరి మున్సిపాలిటీ రూ.48లక్షలు, నాయుడుపేట మున్సిపాలిటీ రూ.30లక్షలు, బుచ్చి రూ.12లక్షలు, అల్లూరు మున్సిపాలిటీ రూ.3లక్షలు, ఉమ్మడి జిల్లాలోని 961 పంచాయితీల నుంచి దాదాపు రూ.3లక్షల గ్రంథాలయ సెస్సు వసూలు కావాల్సి ఉంది.

● కూలుతున్న భవనాలు

నెల్లూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థతోపాటు జిల్లాలో ఇందుకూరుపేట, సీఆర్‌పాలెం, అల్లూరు, దగదర్తి, మనుబోలు, పొదలకూరు, సంగం, ఏఎస్‌పేట, చేజర్ల, రాపూరు, సైదాపురంతోపాటు మరికొన్ని గ్రంథాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. గోడలు, శ్లాబులు పెచ్చులు ఊడి పాఠకులపై పడుతున్నాయి. దీంతో ఆయా గ్రంథాలయాలకు పాఠకులు భయం భయంగానే వస్తున్నారు. నెల్లూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థ భవనం దాదాపు 150 ఏళ్ల కిందట నిర్మించినది. దీనిని 1972లో రేబాల పట్టాభిరామిరెడ్డి ఉచితంగా అందజే శారు. నేడు ఈ భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి.

● సెస్సు సొమ్ము కోసం ప్రదక్షిణలు

సెస్సు వసూళ్ల కోసం నెల్లూరు నగర పాలక సంస్థతోపాటు ఇతర స్థానిక సంస్థల వద్దకు జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులు ప్రదక్షిణలు చేస్తున్నా స్థానిక సంస్థల అధికారులు కనికరించడం లేదు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పలుమార్లు సెస్సు బకాయిలపై సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో చెల్లిస్తామని చెప్పిన పురపాలక కమిషనర్లు తర్వాత పట్టించుకోవడం లేదు.

● జీతాలు అందక ఇక్కట్లు

జిల్లా గ్రంథాలయ సంస్థ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పథకం 1952లో ఏర్పడింది. 71 ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. గ్రంథాలయ సంస్థ తర్వాత ఏర్పడిన ఎన్నో శాఖలకు సిబ్బంది, అధికారుల జీతభత్యాలు ట్రెజరీ ద్వారా చెల్లిస్తున్నారు. అయితే గ్రాంట్ ఇన్‌ఎయిడ్ కారణంగా ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ బకాయిలు కొంతకాలంగా చెల్లించలేదు. దీంతో స్థానిక సంస్థల నుంచి సెస్సు బకాయిలు చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వాలని విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగులు లోకాయుక్తను ఆశ్రయించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో రెగ్యులర్ సిబ్బంది 41 మంది, ఔట్‌సోర్సింగ్ వారు 12 మంది పనిచేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులు (పెన్షనర్లు) 72 మంది ఉన్నారు. గ్రంథాలయాలు విద్యాశాఖకు అనుబంధమైనా ఆ శాఖలో విలీనం చేయకపోవడం వల్లే అభివృద్ధికి నోచుకోలేవడం లేదనే ఆరోపణలున్నాయి.

● అసంపూర్తిగా పనులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పొంగూరు నారాయణ నెల్లూరులో గ్రంథాలయ సంస్థ నూతన భవన నిర్మాణానికి 2018లో శంకు స్థాపన చేశారు. అధునాతన సౌకర్యాలతో భవన నిర్మాణానికి రూ.3కోట్ల నిధులు మంజూరు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక దానిని నిర్లక్ష్యం చేసింది. దాదాపు రెండేళ్ల తర్వాత భవన నిర్మాణం ప్రారంభమైంది. ప్రస్తుతం మొదటి అంతస్తుకు శ్లాబ్ వేశారు. అయితే బిల్లులు రాక కాంట్రాక్టరు వెళ్లిపోయారు. స్థానిక సంస్థలు వసూలు చేసిన గ్రంథాలయ సెస్సును తక్షణం చెల్లించకపోవడంతో గ్రంథాలయాల అభివృద్ధి ఆగిపోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటాం

- ఎన్నికల ప్రచారంలో టీడీపీ నగర అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ


భవన నిర్మాణరంగ కార్మికులతో నారాయణ

నెల్లూరు (విద్య), మే 5 : భవన నిర్మాణ కార్మికులందరికీ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. నగరంలోని గోమతినగర్ నారాయణ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్లంబర్, ఎలక్ట్రిక్, భవన నిర్మాణ కార్మికుల అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నారాయణ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇల్లులేని ప్రతి కార్మికుడికి సొంతి ఇంటి కలను నిజం చేస్తామన్నారు. కార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి వారి ఉన్నతికి పాటుపడతామని చెప్పారు. ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయడంతోపాటు అన్ని విషయాల్లో వారికి పూర్తి సహకారం అందచేస్తామన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే....

రాష్ట్రంలో అధికారంలోకి రానున్నది టీడీపీ కూటమేనని, నారా చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని డాక్టర్ పొంగూరు నారాయణ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని 6వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉడ్‌హౌస్ సంఘంలో వైసీపీకి చెందిన నేతలు, కార్యకర్తలు నారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. గతంలో తాను మంత్రిగా చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతుండడం శుభపరిణామమన్నారు. తాను, వీపీఆర్ ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చామని, నెల్లూరును ఉత్తమంగా తీర్చిదిద్దడ మే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, చింతాల మేస్త్రీ, గురుకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో టీడీపీదే ఆధిక్యత....

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో కూటమికే ఆధిక్యత లభిస్తుండడం సంతోషకరంగా ఉందని డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని గోమతినగర్ క్యాంపు కార్యాలయంలో వైసీపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. నారాయణ మాట్లాడుతూ అరాచకపాలను తరిమికొట్టేందుకు మరో వారం రోజులు అందరం కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. 53వ డివిజన్‌లో పొంగూరు రమాదేవి, 47వ డివిజన్‌లో సింధూర ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● బాలాజీనగర్‌లోని ఓ కల్యాణమండపంలో ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన బ్రాహ్మణుల ఐక్యవేదిక సమావేశంలో టీడీపీ అభ్యర్థి నారాయణ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి సూరిశెట్టి బ్రదర్స్


నారాయణ సమక్షంలో పార్టీలో చేరిన సూరిశెట్టి బ్రదర్స్

వైసీపీ నాయకులు సూరిశెట్టి నరేంద్ర, అతని సోదరులు ఆ పార్టీకి రాజీనామా ప్రకటించి టీడీపీలో చేరారు. పొంగూరు నారాయణ నివాసంలో నారాయణ చేతుల మీదుగా పార్టీ కండువాలు కప్పుకు న్నారు. ఇరగాళమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ సూరిశెట్టి దంపతులను, రాయాజీవీధి ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ ఉమా దంపతులతోపాటు రాష్ట్ర కాపు సంఘం ఉపాధ్యక్షుడు సూరిశెట్టి గిరి కుటుంబ సభ్యులను నారాయణ పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో 46వ డివిజన్ కాపువీధి ప్రాంతాల్లో అత్యధిక మెజార్టీ వచ్చేందుకు కృషి చేస్తామని సూరిశెట్టి బ్రదర్స్ నారాయణకు హామీ ఇచ్చారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్లు

- నగర ఈఈ సోమశేఖర్‌రెడ్డి

నెల్లూరు,(జడ్పీ), మే 5 : నగరంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సెక్షన్లలో ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసినట్లు ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏకే నగర్ సబ్ స్టేషన్ పరిధికి 94906 15250, బీవీ నగర్‌కు 94910 44672, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు 94906 15251, టౌన్‌హాల్ సబ్‌స్టేషన్‌కు 94408 32324. హరనాథపురం 9490615258, స్టోన్‌హౌస్‌పేట 83329 87174, కిసాన్ నగర్ 94906 15256, రామ్మూర్తి నగర్ 94906 15257 వెంకటేశ్వరపురం 93826 00106, డైకాస్‌రోడ్డు 94906 11544, రాజేంద్ర నగర్ 94906 15253, కోటమిట్ట సబ్‌స్టేషన్‌కు 83339 00474 టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశామని తెలిపారు. 24గంటలు ఈ నెంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యుత్ బిల్లులు, మీటర్ల రిపేర్లు, లోఓల్టేజీ వంటి ఏ సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్ ఫిర్యాదు చేయాలని కోరారు.

పూలే జయంతి సంస్మరణ సభ


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు


నెల్లూరు (సాంస్కృతికం), మే 5 : దేశంలో ప్రతి ఒక్కరికి విద్యను అందించాలని పోరాటం చేసిన విద్యాదాత జ్యోతిరావు పూలే అని డాక్టర్ పీఎల్ నరసింహారావు కొనియాడారు. ఆదివారం టౌనుహాలులో జ్యోతిరావు పూలే 198వ జయంతి సంస్మరణ సభ జరిగింది. నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బాలికా విద్య కోసం ఎన్నో కష్టనష్టాలను ఎదిరించి తన భార్య సావిత్రీబాయి పూలేను ఉపాధ్యాయురాలిగా తయారు చేసి మహి ళలకు విద్యను అందించిన త్యాగమూర్తి జ్యోతిరావు అని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రంగస్థల నటుడు సీఆర్ రాఘవ సతీమణి సులోచనమ్మ ద్వితీయ వర్థంతి సందర్భంగా ఆమె చిత్రపటం, జ్యోతీరావు పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభినయ ఆర్ట్స్ సంస్థ దశమ వార్షికోత్సవాన్ని కూడా నిర్వహించారు. 70 ఏళ్ల క్రితం పులుగొండ్ల రామకృష్ణయ్య రచించిన తుపాను నాటికను ప్రదర్శించారు. సీఆర్ రాఘవ దర్శకత్వం వహించడంతోపాటు ప్రధాన పాత్రను పోషించారు. ప్రేక్షకులను ఈ నాటిక ఆకట్టుకుంది.

ప్రమాదాలకు కేరాఫ్ పొదలకూరు రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- కనిపించని డివైడర్లు


రోడ్డుపై గుంతలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 5 : నగరంలో ట్రంకురోడ్డు తర్వాత ప్రధానమైన రహదారుల్లో పొదలకూరు రోడ్డు ఒకటి. నిరంతరం వాహన రాకపోకలతో రద్దీగా ఉంటుంది. పొదలకూరు రోడ్డు సెంటర్ నుంచి డైకస్ రోడ్డు సెంటర్ వరకు ఆ రోడ్డు మీద ప్రయాణం ప్రమాదాలకు ఎదురెళ్లినట్లు ఉంటోంది. ఈ రోడ్డుపై చిన్నా పెద్ద గుంతలు అన్ని కలిపి దాదాపు 100కుపైగా ఉంటాయి. ఏ మాత్రం ఏమరుపాటుగా వాహనం నడిపినా రోడ్డుపై పడిపోవాల్సిందే. గత 5 సంవత్సరాలుగా అధికారం చెలాయించిన వైసీపీ ప్రజాప్రతినిధులు ఈ రోడ్డుపై గతుకులు పూడ్చిన జాడలేదు. గతంలో డబుల్ రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించడం బాగానే ఉన్నా మధ్యలో డివైడర్ నిర్మించకుండా వదిలేశారు. డివైడర్ కోసం వదిలిన భాగంగా రోడ్డు గుంతగా ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు వెంబడి ఆక్రమణలు కూడా భారీగానే ఉన్నాయి. రోడ్డు మార్జిన్లు లేకపోవడం వాహనదారుల అవస్థలకు కారణమవుతోంది. ఈ రోడ్డు కిందనే నగరపాలక సంస్థ తాగునీరు పైపులైన్లు ఉంది. ఆ పైపులైన్లు తరచూ రిపేరుకు రావడంతో రోడ్డును పలుచోట్ల తవ్వి వదిలేశారు. దీంతో రహదారి గుంతలుమయంగా మారింది. వర్షాకాలంలో ఈ రోడ్డుపైన పాదచారులు, ద్విచక్రవాహనదారులు ప్రయాణించాలంటే భయపడిపోతున్నారు. వర్షాకాలం రాకమునుపే రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


పొదలకూరురోడ్డుపై డివైడర్ నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా రహదారి మధ్యభాగం

కోవూరు సర్వేపల్లి

నాగాయగుంటలో నీటి కష్టాలు



నాగాయగుంట పంచాయతీలో అడుగంటిన ఊట బావి

బుచ్చిరెడ్డిపాళెం,మే5: మండలంలోని నాగాయగుంట, ఆ పంచాయతీలోని అనంతనారాయణపురం గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు కష్టాలు పడుతున్నారు. ఆ రెండు గ్రామాలకు కలిపి వున్న ఒకే ఒక్క బావిలో ఊరితేనే తాగునీరు లేకుంటే కష్టాలే. నాగాయగుంట గ్రామ పంచాయతీలో రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 400 కుటుంబాల వారు వున్నారు. కానీ ఇక్కడ ఊట బావిలో రెండురోజులకో, మూడురోజులకో ఊరితేనే అదీ ప్రధాన పైపులైనులో వున్నవారికే రెండు మూడు బిందెలు నీళ్ళు వచ్చి ఆగిపోతాయని స్థానికులు వాపోతున్నారు. ఒంగల్లు గ్రామం నుంచి డ్రమ్ము నీళ్ళు 1500రూపాయలకు కొనుక్కుని కాలంగడపుకుంటున్నట్లు రెండు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నాగాయగుంట, ఆ పంచాయతీలోని అనంతనారాయణపురం గ్రామాల్లో తరాలు మారుతున్నా తాగునీటి కష్టాలు మాత్రం తీరడంలేదని, ఎన్నికలొస్తేనే ఓట్లుకోసం వస్తారు తప్ప దాహార్తిని తీర్చేవారే లేరని పెదవి విరుస్తున్నారు.

కాకాణి మద్యం ప్రాణాలకే ప్రమాదం : సోమిరెడ్డి



తోటపల్లిగూడూరు: టీడీపీలో చేరిన పాపిరెడ్డిపాళెం గ్రామస్థులు

వెంకటాచలం, మే 5 : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇచ్చే మద్యం ప్రాణాలకే ప్రమాదమని, ఎవరూ తీసుకోవద్దని, వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకాణి చేసిన పాపాలకు మే 13న జరిగే ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజకీయంగా నరకం అనుభవించక తప్పదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని అనికేపల్లి, కంటేపల్లి, ఇస్లాంపేట గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సర్వేపల్లిలో జరిగిన భూకుంభకోణాలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయిస్తామని, వైసీపీ నాయకులు దోచుకున్న భూములను తిరిగి పేదలకే అప్పగిస్తానని, ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కాగా, సోమిరెడ్డి సమక్షంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, కుంకాల నాగేంద్రప్రసాద్, బొమ్మి సురేంద్ర, చల్లా రవీంద్ర, గొట్టం బ్రహ్మయ్య, ఆయా గ్రామాల నాయకులున్నారు.

ఒక్కసారి ఆశీర్వదించండి.. సేవ చేస్తా !

తోటపల్లిగూడూరు: ఒక్కసారి ఆశీర్వదించి సేవ చేసే భాగ్యం కల్పించాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని పొట్లపూడి గ్రామంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, బండి శ్రీకుమార్‌రెడ్డి, ఏలూరు భరత్‌రెడ్డి, ఈదూరు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచితో సహా 160 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండలంలోని పాపిరెడ్డిపాళెం సర్పంచ్ కదురు వెంకటసుబ్బయ్య, 160 కుటుంబాలు, కొత్తపాలెం గ్రామం నుంచి 30 కుటుంబాలు వేదాయపాళెంలోని సోమిరెడ్డి నివాసంలో టీడీపీలో చేరారు. వారికి సోమిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు.

గెలిపిస్తే దేగపూడి కాలువ పూర్తిచేస్తా

మనుబోలు : తనను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే దేగపూడి-బండేపల్లి కాలువ పూర్తిచేయిస్తానని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని వడ్లపూడి పంచాయతీలో ఆదివారం సాయంత్రం సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనెంకుల రఘురామనాయుడు, బీజేపీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

● సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కోడలు సోమిరెడ్డి శృతిరెడ్డి కొలను కుదురు గ్రామంలో ప్రచారం నిర్వ హించారు. బండేపల్లికి చెందిన 14 కుటుంబాలు వైసీపీని వీడి గ్రామ టీడీపీ నాయకులు ఉడతా మస్తానయ్య ఆధ్వర్యంలో సోమిరెడ్డి సమక్షంలో నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వడ్లపూడి పర్యటనలో బిరదవోలు పంచాయతీకి చెందిన పలు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

● **ముత్తుకూరు :** పైనంపురం పంచాయతీలో ఆదివారం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు శృతిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ జెన్‌కో థర్మల్ కేంద్రాల బూడిదతో గిరిజనుల బతుకులు ఛిటికిపోయాయని, మంత్రి కాకాణికి ఈ పంచాయతీ ప్రజల పాట్లు పట్టవా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా సోమిరెడ్డిని, ఎంపీగా వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

45 కుటుంబాలు టీడీపీలో చేరిక

వేదాయపాళెంలోని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కార్యాలయంలో ఆదివారం మండలంలోని ఎగువమిట్ట, కంటేపల్లి గ్రామాల నుండి వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సహా 45 కుటుంబాలు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి.

● మండలంలోని ఎగుమమిట్ట గ్రామంలో సోమిరెడ్డి కుమార్తె డాక్టర్ సింధురెడ్డి ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సోమిరెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మునీంద్రబాబు, కృష్ణయ్య, మల్లికార్జున్ తదితరులున్నారు.

అదానీ కృష్ణపట్నం పోర్టుకు ప్లాటినం అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ జ్యోతి

ముత్తుకూరు, మే 5 : పోర్టు అండ్ హార్బర్స్ సెక్టార్‌లో ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ కేటగిరికి సంబంధించి అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ అవార్డు 2023 కింద ప్లాటినం అవార్డును న్యూఢిల్లీలో అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్‌ప్రతినిధి డాక్టర్ జ్యోతి గణపతి అందుకున్నారు. ఎంపికైన పరిశ్రమలకు అవార్డులను అందించడానికి న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదాని కృష్ణపట్నం పోర్టు వైస్ ప్రెసిడెంట్ (ఎన్విరాన్మెంట్) డాక్టర్ జ్యోతి గణపతి ఈ అవార్డును స్వీకరించారు. డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు తన కార్యకలాపాలలో సుస్థిరతకు ప్రాధాన్యతనిస్తూ పర్యావరణ అనుకూల పద్ధతులను అమలు చేయడంలో అంకితభావంతో పనిచేయడం వలన ఈ అవార్డు దక్కిందన్నారు. అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జిజేరావు మాట్లాడుతూ అదాని పోర్టు పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడమే కాకుండా కార్పొరేట్ సామాజిక బాధ్యతను కూడా నియమబద్ధంగా నిర్వహిస్తుందన్నారు. తమ ప్రతి కార్యాచరణ మన భూమండలం స్థిరమైన, మెరుగైన భవిష్యత్తు కోసం, అదానీ గ్రూపు సంస్థల లక్ష్యాలను అనుగుణంగా ఉంటాయని తెలిపారు. ఈ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అరాచక పాలనను అంతం చేయాలి

● వెంకటగిరి కూటమి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ



మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

సైదాపురం, మే 5: ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు అరాచక పాలన కొనసాగించారని ఈ ఎన్నికల్లో వారిని ఇంటికి సాగనంపాలని వెంకటగిరి కూటమి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం చాగణం, చాగణంరాజుపాళెం, మర్లపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడారు. సీఎం జగన్ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. తనకు సైకిల్ గుర్తుపై, తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావుకు కమలంగుర్తుపై ఓట్లు వేసి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు తానంకి నానాజీ, మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్ కృష్ణారెడ్డి, జోగిపల్లి సర్పంచు గుంటమడుగు కృష్ణంరాజు, నాయకులు సుబ్రమణ్యంరాజు, వదరబండి హరనాథ్‌రెడ్డి, బద్వేల్ జనార్దన్ రెడ్డి, కందాటి దయాకర్‌రెడ్డి, కందాటి విజయ్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లి సిద్దయ్య, రవీంద్ర రాజు, రాజేష్ రాజు పాల్గొన్నారు.

రేణుకమ్మకు ప్రత్యేక పూజలు



రేణుకమ్మకి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొడవలూరు మే 5 : మండలంలో పెమ్మారెడ్డిపాలెంలోని రేణుకమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు ఆలయ ప్రాగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

కామాక్షితాయి అన్నదాన సదనానికి విరాళం



లక్ష రూపాయలు విరాళం అందజేసిన దాతలకు రసీదు అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 5: మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో కామాక్షితాయి నిత్యాన్న దానానికి బెంగళూరుకు చెందిన డాక్టర్ డి శ్రీనివాసరావు, సుజాత దంపతులు లక్ష రూపాయల విరాళం ఆన్లైన్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం దాతల గోత్రనామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష



నీట్ పరీక్ష కోసం వచ్చిన విద్యార్థులు

వెంకటాచలం, మే 5 : మండలంలో ఆదివారం నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో ప్రభుత్వం నీట్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్ష సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

వెంకటాచలం, మే 5 : సర్వేపల్లి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఎన్నిక ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 387 మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 1268 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. ఈనెల 7వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం ఉన్నందున మరింత మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

కోడ్ ఉల్లంఘన పట్టించుకోరా.. ?

మనుబోలు, మే 5: మండలంలో ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా వైఎస్ విగ్రహంకు ముసుగు వేశారు. దాని పక్కనే ఉన్న వైసీపీ పోల్‌కు మూడు రంగులు వేసి ఉన్నా వాటికి తొడగలేదు. మనుబోలు గ్రామంలో ఇతర పార్టీల పోల్స్‌కు రంగులు లేకున్నా కనబడకుండా గోతాలు వేసిన అధికారులకు వైసీపీ పోల్‌కు రంగులు బాహటంగా కనిపిస్తున్నా పట్టించుకోకపోవడాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



విగ్రహం పక్కనే స్తంభానికి ఉన్న వైసీపీ రంగులు

వైసీపీ రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడాలి

● అక్రమ కేసులు బనాయించడంలో ప్రసన్న దిట్ట ● కోవూరు టీడీపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కొడవలూరు: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కొడవలూరు, మే 5: వైసీపీ రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని, గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో అక్రమాలు, అవినీతి రాజ్యమేలాయని, వాటిని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడంలో ప్రసన్నకుమార్‌రెడ్డి దిట్ట అని కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో పాతవంగల్లు, తాటెకుల దిన్నెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రశాంతిరెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఓటువేసి ఆశీర్వదించాలని కోరారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయేది టీడీపీ ప్రభుత్వమని, అక్రమ కేసులను తొలగిస్తామని భరోసా ఇచ్చారు. రానున్నవి రాష్ట్ర భవిష్యత్ మా ర్చే ఎన్నికలని, ఒక్క చాన్స్ నినాదానికి మళ్లీ మోసపోవద్దన్నారు. అధోగతిపాలైన రాష్ట్రంలో అభివృద్ధి కావాలంటే టీడీపీని గెలిపించాల్సిన చారిత్రక అవసరముందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి జరిగి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రావాలన్నారు. పాత వంగల్లు, తాటెకులదిన్నె, గౌతమినగర్ పంచాయతీలలో అనేక సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని, పంచాయతీల దశ దిశ మారుస్తానని ఆగ్రామ ప్రజలకు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని కెవిఆర్ విజయ్ పర్యవేక్షించగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, వడ్లమూడి నరేంద్రబాబు, పాండురంగారావు, చిరుమామిళ్ల నళిని, రవిబాబు, పుట్ట సుబ్రమణ్యం నాయుడు, కంచెర్ల బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : సాల్మానుపురంలో అర్జున్‌రెడ్డి ప్రచారం

● కొరుటూరు, నరసాపురం గ్రామాల్లో...

ఇందుకూరుపేట: మండలంలోని కొరుటూరు, నరసాపురం గ్రామాలలో ఆదివారం ప్రశాంతిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైపాడు నుంచి కొరుటూరు గ్రామానికి తారురోడ్డు వేస్తామని, సాగు, తాగునీరు కొరత లేకుండా చూస్తామని, నూర్‌బాషాలకు రూ.100కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, మైనారిటీ కార్పొరేషన్ నుంచి రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని, ఇమామ్‌లకు నెలకు రూ.10వేలు, మౌజనులకు రూ.5వేలు గౌరవ వేతనం ఇస్తామన్నారు. హజ్‌యాత్రకు రూ.లక్ష, మసీదుల నిర్వహణకు నెలకు రూ.5వేలు ఇస్తామని తెలిపారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి,

ప్రశాంతిరెడ్డి విజయానికి కృషిచేయాలి

కొడవలూరు: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయానికి కృషిచేయాలని గౌడసంఘం జిల్లా నాయకుడు దాసరి విజయ్‌కుమార్ గౌడ్ కోరారు. మండల పరిధిలోని పెమ్మారెడ్డిపాళెంలో ఆదివారం జరిగిన గౌడసంఘం నాయకుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో కల్లు గీత కార్మికుల జీవనం అస్తవ్యస్థంగా మారిందన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును ఎన్నుకోవాలని, నియోజకవర్గ అభివృద్ధికి కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి దంపతులను గెలిపించాల్సిందిగా కోరారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు మాట్లాడారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలి

విడవలూరు: వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ టీడీపీ, బీజేపీ, మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఊటుకూరు దళితకాలనీల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు బెజవాడ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును మార్చేందుకు టీడీపీ అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయాలన్నారు. బీజేపీ నాయకుడు కనుపర్తి నాగేంద్ర, మాలమహానాడు నాయకురాలు పల్లం శేషమ్మ దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, చెంచుకిషోర్ యాదవ్, అవ్వారు ఏడుకొండలు, బట్టేపాటి సురేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులను గెలిపించాలి

బుచ్చిరెడ్డిపాళెం: వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ కుమారుడు అర్జున్‌రెడ్డి ఆదివారం పెనుబల్లి, సాల్మానుపురం గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేశారు. సర్పంచు పెంచలయ్య, జొన్నవాడ ప్రసాద్, సాల్మానుపురంలో కొండారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రఘురామిరెడ్డి, బి.నరసింహారెడ్డి, బీజేపీ. జనసేన టీడీపీ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. పెనుబల్లిలో సింగిరి చిన బాబు ఆయన అనుచరులు 30మందితో వైసీపీని వీడి టీడీపీ నాయకుడు సీహెచ్ సురేష్‌రెడ్డి నివాసంలో సూరా శ్రీనివాసులురెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే బుచ్చి నగర పంచాయతీ పుట్టవీధి పరిధి, 11 14, 15 వార్డుల్లో నాయకులు ఆర్‌కే రవి, వి సుధీర్, కే రాధారెడ్డి, సీహెచ్ నరసింహులు ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు.



జెండా ఊపి ప్రచార రథాలను ప్రారంభించిన ఎన్నికల నోడల్ ఆఫీసర్ పద్మావతి, చిత్రంలో కలెక్టర్ హరినారాయణన్

ఓటు హక్కు ప్రచార రథాల ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), మే 5: ప్రతిఒక్కరూ ఈనెల13న తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ రూపొందించిన ప్రచార రథాలను ఆదివారం నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఎన్నికల నోడల్ ఆఫీసర్ పద్మావతి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్ పాల్గొని మాట్లాడారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికి ఓటు వినియోగంపై అవగాహన కల్పించేలా ప్రచారరథాలను ప్రారంభించామన్నారు. గతంలో జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో తక్కువ ఓటింగ్‌శాతం నమోదైందని, ఓటింగ్ శాతం పెంచేందుకు ఈ రథాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

● బెలూన్ ప్రారంభం

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఓటర్లను చైతన్య పరిచేలా మస్కట్‌ను, బెలూన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నోడ్ అధికారులు బాపిరెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైం). మే 5: నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాల, వీఆర్ కళాశాల్లో ఆదివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ పరిశీలించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పోలింగ్ రోజున పోలింగ్‌బూత్‌లకు 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇతరులెరూ ఉండకుండా చూడాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

ఉరేసుకుని బాలిక బలవన్మరణం

నెల్లూరు(క్రైం). మే 5: ఓ బాలిక తన ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నెల్లూరు బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మధురా నగర్‌లో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు, ముధురానగర్‌కి చెందిన మమత నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో వంటపని చేస్తుంది. ఆమెకు ఒకటే కుమార్తె. ఆ బాలిక ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. శనివారం మమత కావలి వెళ్లడంతో బాలిక తన ఇంట్లోని ఫ్యానుకు చున్నితో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి ఇంటికి వచ్చిన మమత తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా రాలేదు. లోపల గడిపెట్టి ఉండటాన్ని గమనించి స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లింది. కుమార్తె ఫ్యానుకు వేలాడుతూ కనిపించడంతో భోరున విలపిస్తూ స్థానికుల సహాయంతో కిందకు దించింది. అనంతరం సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు బాలిక అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఈ మేరకు మమత ఆదివారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మద్యం డంప్ కేసులో నిందితుల అరెస్టు

● ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్‌లకు రిమాండ్

పొదలకూరు, మే 5 : మండలంలోని విరువూరు రైస్ మిల్లులో పది రోజుల కిందట భారీగా మద్యం డంప్ కేసులో ఏడుగురు నింది తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఈనెల 17వరకు వారికి రిమాం డ్ విధించినట్లు సెబ్ సీఐ వెంకటరావు ఆది వారం పత్రికా ప్రకటనలో తెలిపారు. గత నెల 24న ఎఫ్ఎస్‌టీ మెంబర్స్ ఎస్వీ సుబ్రహ్మణ్యం, వై శ్రీనివా సులు, వీడియోగ్రాఫర్స్ భరత్‌కి సమాచారం రావడంతో రైస్ మిల్లులో తనిఖీ చేపట్టారు. విచారణలో 2649 మద్యం సీసాలను తాటిపర్తి, సూరాయ పాలెంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలకు సంబంధించినవిగా సెబ్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో తాటిపర్తి మద్యం షాపులో పనిచేసే ఇద్దరు సేల్స్ మెన్ చిర్రా విజయరామిరెడ్డి, కుప్పాల వెంకటవినోద్‌కుమార్‌ను అలాగే సూరాయపాలెం మద్యం షాపులో పనిచేసే సూపర్‌వైజర్ మల్లెల అనీల్, సేల్స్‌మెన్ గణేశం విష్ణువర్ధన్‌రెడ్డి, ఉయ్యాల కృష్ణ, రైస్‌మిల్లు యజమాని చిర్రా రాజగోపాల్‌రెడ్డిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి 17వరకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. అయితే మరో సూపర్‌వైజర్ పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. కాగా, వారిని పూర్తి స్థాయిలో విచారించి వారి వద్ద నుంచి ఎవరు మద్యం కొనుగోలు చేశారు. వారి చేత ఎవరుకొనుగోలు చేయించారో వారిని వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అప్పసముద్రం పాఠశాలలో చోరీ

● రూ.1.27 లక్షల సామగ్రి అపహరణ

ఉదయగిరి రూరల్, మే 5: అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో చోరీ జరిగిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల గది తాళాలు పగలగొట్టి అందులో నాడు-నేడు పథకం కింద మంజూరైన 24 సీలింగ్ ఫ్యాన్‌లు, వైర్ కాయిల్స్, ఏసీ, పాత విద్యుత్ మోటార్ చోరీ చేశారు. శనివారం గ్రామస్థులు చోరీ జరిగిందని గుర్తించి సమాచారాన్ని ప్రధానోపాధ్యాయులు విజయకుమార్ సమాచారం అందిం చారు. ఆయన పాఠశాలకు వెళ్లి పరిశీలించి రూ.1.27 లక్షల వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు ఉదయగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

సోమశిలలో 8.082 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 5: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు ఆది వారానికి జలాశయంలో 8.082టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువడెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతి

బుచ్చిరెడ్డిపాళెం, మే 5: కారు ఢీకొని లారీ డ్రైవర్ మృతిచెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి బుచ్చి టోల్‌గేట్‌సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం బేతంచర్ల పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ చెరుకుముడి మద్దిలేటి స్వామి (47) కృష్ణపట్నం పోర్టు నుంచి బొగ్గులోడుతో కర్నూలు వెళ్తూ బుచ్చి టోల్‌గేట్ సమీపంలో టిఫిన్ చేసే నిమిత్తం లారీని రోడ్డుపక్కన నిలిపి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొంది. దీంతో మద్దిలేటి స్వామి మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లారీ డ్రైవర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్


	కిలో
బాయిలర్ లైవ్	152
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	266
స్కిన్‌లెస్	296
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6784
వెండి కిలో ధర	రూ. 82,600
వెండి ఒక గ్రాము	రూ. 84.60

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 6 మే 2024



పోస్టల్ బ్యాలెట్‌కు పోటెత్తిన ఓటర్లు

పోలింగ్ కేంద్రాల్లో ఎండ వేడిమికి తోడు సదుపాయాల కొరతతో అల్లాడిన ఉద్యోగ,ఉపాధ్యాయులు

తిరుపతి, మే 5 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు వేసేందుకు ఉద్యోగులు పోటెత్తారు.గతంలో వారి నుంచీ బ్యాలెట్ పత్రాలు చాలావరకూ ప్రధాన పార్టీల అభ్యర్థులే సేకరించి పోస్టులో పంపడం జరిగేది. ఈసారి దానికి భిన్నంగా ఉద్యోగులే ముందస్తుగా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిన సంగతి తెలిసిందే. సాధారణంగా ఓటు వేయడానికి పెద్దగా ముందుకు రాని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ పర్యాయం పట్టుదలగా, కసిగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చినట్టు కనిపించింది. అయితే ఎండ వేడిమికి తోడు సదుపాయాల కొరతతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు.



ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో



మహిళావర్సిటీలో

తొలిరోజు పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

సెగ్మెంట్	ఎన్నికల విధుల ఓటర్లు	అత్యవసర సర్వీసుల ఓటర్లు
గూడూరు	1053	025
సూళ్ళూరుపేట	915	007
వెంకటగిరి	1240	016
తిరుపతి	2187	041
శ్రీకాళహస్తి	1561	036
సత్యవేడు	747	032
చంద్రగిరి	1800	051
ఇతర జిల్లాల	2478	208
మొత్తం	11894	416



పోలింగ్ కేంద్రం వద్ద పార్టీ కండువాలతో వైసీపీ శ్రేణులు

చంద్రగిరి పోలింగ్ కేంద్రం ఎదుట పులివర్తి నానీ ధర్నా

తిరుపతి పద్మావతీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన చంద్రగిరి నియోజకవర్గ పోలింగ్ కేంద్రంలో ఉదయం నుంచే ఓటర్లు భారీగా క్యూలైన్‌లో బారులు తీరారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు ఎండ వేడిమికి, ఉక్కపోతకూ మహిళా ఓటర్లు క్యూలైన్‌లో ఇబ్బంది పడ్డారు. పలువురు ఓటర్లు క్యూలైన్‌లో ఉండలేక ఓ దశలో కేంద్రంపైపు తోసుకుని వెళ్లారు. వారిని అదుపుచేసేందుకు పోలీసులు అవస్థ పడ్డారు. ఆ సందర్భంగా ఓటర్లకు పోలీసులకు నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. కొందరు ఎండలో ఉండలేక ఓటు వేయకుండానే తిరిగి వెళ్లిపోయారు. ఈ పరిస్థితిని గమనించిన టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ ఓటర్లకు తగిన సౌకర్యాలు కల్పించలేదని ఆరోపిస్తూ పోలింగ్ కేంద్రం ఎదుట అనుచరులతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో నిషాంత్ రెడ్డి సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కూడా సందర్శించారు. కేంద్రం బయట ఓటర్లను ఇరుపార్టీ నాయకులు ఓట్లు అభ్యర్థిస్తూ కనిపించారు.



తిరుపతిలో పోలీసులతో సీపీఐ నేతల తోపులాట

తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన తిరుపతి నియోజకవర్గ పోలింగ్ కేంద్రం వద్ద సీపీఐ నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఓటర్లకు సీపీఐ నాయకులు అడ్డుగా ఉన్నారంటూ పోలీసులు నెట్టడంతో ఈ వివాదం తలెత్తింది. వాగ్వాదం ముదిరి పోలీసులు, సీపీఐ నాయకులు పరస్పరం తోపులాటకు దిగారు. కాగా ఈ కేంద్రం వద్ద ఇరు పార్టీ నేతలు ప్రచారంతో హడావుడి చేశారు. ఎండకు చల్లగా ఫ్యాన్‌కి ఓటేయమని వైసీపీ నేతలు, ఎండకు చల్లని నీరును గ్లాసులో తాగాలంటూ కూటమి నేతలు ఉద్యోగులను అభ్యర్థించారు. మరోవైపు ఓటర్లు లైన్‌లో లేరని, ఉంటేనే సంతకాలు చేస్తానంటూ విధుల్లోని ఓ అధికారి సంతకం చేయకుండా లేచివెళ్లిపోయారు. సీఎం జగన్ స్టిక్కర్‌తో కూడిన కారు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడం విమర్శలకు దారి తీసింది.



ఎస్వీ ఆర్ట్స్ కళాశాల బయట ఓటర్లకు నేతల అభ్యర్థనలు

పోలీసులతో బొజ్జల సుధీర్ వాగ్వాదం

శ్రీకాళహస్తి పోలింగ్ కేంద్రం గేటు వద్ద పరిమితికి మించి వైసీపీ వారిని అనుమతించడంపై టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. గేటు వద్ద పదిమంది కంటే ఎక్కువమంది ఉండకూడదని నిబంధన పెట్టిన డీఎస్పీ వైసీపీ వారిని మాత్రం వందల సంఖ్యలో అనుమతించడం వివాదానికి కారణమైంది. పోలింగ్ కేంద్రం గేటు వద్ద వుండి ఇంతమంది ప్రచారం చేయడాన్ని ఎలా అనుమతించారంటూ సుధీర్ నిలదీశారు. దీంతో కొంతసేపు పోలీసులకూ, ఆయనకు మధ్య వాగ్వాదం జరిగింది. ఉద్యోగులు పోలింగ్‌కు వెళ్లే సమయంలో ప్రచారం చేస్తున్న వైసీపీ, టీడీపీ నాయకులు కూడా వాగ్యుద్ధానికి దిగారు. మరోవైపు రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టి నిర్వహిస్తున్న పోలింగ్‌లో ఓటర్లకు సదుపాయాలు ఎక్కడున్నాయని సుధీర్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు.కూర్చోవడానికి కుర్చీలు, తాగు నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎలక్షన్ డబ్బును ఏం చేశారని ప్రశ్నించారు. కాగా వైసీపీ నాయకులు కొంత మంది పార్టీ కండువా కప్పుకుని ప్రచారం చేయడం గమనార్హం. బొజ్జల రిషిత రెడ్డి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఇక పోలింగ్ కేంద్రం ముందు టీడీపీ,వైసీపీ నేతలు పోటాపోటీగా టెంట్లు వేసుకుని తిష్టవేశారు.

సత్యవేడులో ఆర్వోకు వ్యతిరేకంగా నినాదాలు

సత్యవేడు పోలింగ్ కేంద్రం వద్ద సదుపాయాల కొరతతో మండిపడిన ఉద్యోగులు రిటర్నింగ్ అధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో 1,366 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. నాలుగు మండలాల ఉద్యోగులకు ఒకే గదిని కేటాయించడంతో ఎక్కువ సమయం వేచి వుండాల్సి వచ్చింది. ఎండ వేడికి, ఉక్కపోతకు విసిగిపోయిన ఉద్యోగులు ఓటర్ల సంఖ్యకు సరిపడా సదుపాయాలు కల్పించలేదంటూ రిటర్నింగ్ అధికారిపై మండిపడ్డారు. ఆర్వోకు వ్యతిరేకంగా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.కనీసం తాగేందుకు నీరు,కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. సరైన వసతులు లేనికారణంగా కొందరు ఉద్యోగులు ఇంటికే పరిమితమయ్యారు. ఇక, పుత్తూరులో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని మంత్రి రోజా సందర్శించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

పుత్తూరులో పోలింగ్ కేంద్రమున్నా తిరుపతికి ఉద్యోగుల కేటాయింపు

ఇతర జిల్లాల్లో ఎన్నికల విధులకు కేటాయించబడిన ఉద్యోగుల కోసం తిరుపతి ఎస్వీ క్యాంపస్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. నగరి నియోజకవర్గానికి సంబంధించి ఉద్యోగులకు పుత్తూరులో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ పలువురు అక్కడి ఉద్యోగులను ఓటింగ్ కోసం తిరుపతిలోని ఈ కేంద్రానికి పంపించారు. దీనిపై సంబంధిత ఉద్యోగుల నుంచీ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పుత్తూరులో పోలింగ్ కేంద్రం వున్నా తమను తిరుపతికి ఎందుకు పంపిస్తున్నారని వారు ప్రశ్నించారు. కాగా ఈ కేంద్రాన్ని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాశ్‌రెడ్డి, మంత్రి రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి సందర్శించారు.



పోలీసు అధికారులను ప్రశ్నిస్తున్న సుధీర్ రెడ్డి

నేడు కూడా 'పోస్టల్ బ్యాలెట్' ఓటేయచ్చు

- 13న పోలింగ్ బూతుల్లోకి సెల్‌ఫోన్‌కి అనుమతిలేదు
- కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో పోలింగును పరిశీలిస్తున్న కలెక్టర్,కమిషనర్

తిరుపతి కలెక్టరేట్/రూరల్, మే 5: పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోని ఉద్యోగులు సోమవారం కూడా ఓటు వేయవచ్చని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ స్ట్రాంగ్‌రూమ్‌లో అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల ఈవీఎంల కమిషనింగ్‌ని ఆదివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగిందన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఓటర్లతోపాటు పోలింగ్ ఏజెంట్లు, ప్రభుత్వం తరఫున ఉన్న వీడియోగ్రాఫర్లు కూడా పోలింగ్ బూత్‌లలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. అయితే సెక్టార్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్‌కు మాత్రమే ఫోన్ అనుమతి ఉందని.. వారు కూడా స్విచ్ ఆఫ్ చేసి తమవద్ద ఉంచుకోవాలని తెలిపారు. ఈవీఎంలు పనిచేయకుంటే ఆ విషయం తెలియజేసేందుకు మాత్రమే ఫోన్‌ని ఆన్‌చేసి విషయం చెప్పాక ఆఫ్ చేసేయాలని ఆదేశించామని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మొబైల్ ఫోన్ డిపాజిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మీడియా సిబ్బందికి పోలింగ్ బూత్ వద్ద ఓటర్లు నిలబడి ఉన్న క్యూలైన్ల వరకు మాత్రమే అనుమతి ఉందని, లోపలికి అనుమతి లేదని స్పష్టం చేశారు. మీడియాను అనుమతించే విషయమై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం కమిషనింగ్ కార్యక్రమం పూర్తి చేస్తున్నామని, 12వతేదీన పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సామగ్రి పంపిణీ ఉంటుందని వివరించారు. తిరుపతి అసెంబ్లీ ఆర్వో అదితిసింగ్, పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు ఉజ్వల్‌కుమార్ ఘోష్ పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ పరిశీలన

ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసి, చంద్రగిరి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్‌ని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. అలాగే పార్లమెంటుకు సంబంధించి ఈవీఎంల రెండో దఫా ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టరేట్‌లో నిర్వహించారు. రాజకీయపార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోనివారికి మరో అవకాశం

ఫారం-12తో సకాలంలో దరఖాస్తు చేసుకోని వారికి ఈ నెల 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కి ఎన్నికలసంఘం మరో అవకాశం ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ఇప్పటికే దరఖాస్తు చేసుకుని, కొన్ని కారణాలతో తిరస్కరించబడిన వారు కూడా ఈ రెండ్రోజుల్లో సంబంధిత ధ్రువపత్రాలతో ఓటింగ్ సౌకర్యం వినియోగించుకోవాలని సూచించారు.

నేడు, రేపు హోంఓటింగ్

ఇంట్లోనే ఓటు వేయడానికి దరఖాస్తు చేసుకున్న 85ఏళ్లు దాటిన వృద్ధులకు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులకు సోమ, మంగళవారాల్లో హోం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ తెలిపారు.

మహిళా వర్సిటీ పోలింగ్ కేంద్రంలో అవస్థలు

తిరుపతి(వైద్యం), మే 5: మహిళా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు తిప్పలు తప్పలేదు. ఓటింగ్ ప్రక్రియే 11.30గంటల దాకా ప్రారంభం కాలేదు.మధ్యాహ్నాం 3 గంటల సమయానికి వెయ్యి ఓట్లు కూడా పోల్ కాకపోవడం, ఉద్యోగులు భారీగా క్యూలో ఉండడంతో క్యూలో నిల్చోలేక పలువురు ఉద్యోగులు ఓటు వేయకనే వెనుదిరిగి వెళ్లారు.ఈ క్రమంలో రాత్రి 7 గంటలకు చీకటి అలుముకోవడంతో పోలింగ్ కేంద్రంలో తప్ప బయట లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు చీకట్లో వేచి ఉండాల్సి వచ్చింది. ఓ పక్క ఉక్కపోత, మరో పక్క చిమ్మ చీకట్లతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.ఎట్టకేలకు రాత్రి 9 గంటల సమయంలో ఓట్ల ప్రక్రియ ముగిసింది. ఆ సమయానికి 2091మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.



చీకట్లో కూర్చొనివున్న ఉద్యోగులు

ప్రశాంతంగా నీట్

97.37 శాతం విద్యార్థుల హాజరు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 5: అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ (ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్) కోర్సుల్లో ప్రవేశాలకు సోమవారం జరిగిన జాతీయ స్థాయి పరీక్ష నీట్ యూజీ-2024 ప్రశాంతంగా ముగిసింది. తిరుపతి పరిధిలోని తొమ్మిది కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 97.37 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా కోఆర్డినేటర్ కైలాష్‌నాథ్ తెలిపారు. మొత్తం 4,692 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 4,569 మంది హాజరయ్యారు. 105 మంది గైర్హాజరయ్యారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిబంధనల ప్రకారం పరీక్షను పకడ్బందీగా నిర్వహించారు.

కేంద్రాల వారీగా హాజరు

ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో 774 విద్యార్థులకుగాను 730 మంది హాజరయ్యారు. అలాగే గీతం స్కూల్లో 600మందికిగాను 580 మంది, ఎడిఫై స్కూల్లో 600 మందికిగాను 586 మంది, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కేంద్రంలో 600 మందికిగాను 585 మంది, లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో 504 మందికిగాను 496 మంది, విశ్వం పాఠశాలలో 504 మందికిగాను 494 మంది, మార్గ్ చిన్మయ విద్యాలయలో 432 మందికిగాను 419 మంది, శ్రీవిద్యానికేత్ ఇంటర్నేషనల్ స్కూల్లో 384 మందికిగాను 370 మంది, శ్లోక బిర్లా స్కూల్‌లో 324 మందికిగాను 309 మంది పరీక్ష రాశారు.

భౌతికశాస్త్రం చాలా కఠినం

బోటనీ ప్రశ్నలు నిడివి ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు వాటిని చదివేందుకే ఎక్కువ సమయం పట్టిందని, వాటికి పూర్తిస్థాయిలో జవాబులు రాసేందుకు సుమారు 1.30 గంట సమయం తీసుకుందని విద్యార్థులు చెప్పారు. ఇక జంతుశాస్త్రం పేపర్ సులభంగా వచ్చిందని, రసాయన శాస్త్రం కష్టంగా, భౌతిక శాస్త్రం ప్రశ్నంలు మరింత కఠినంగా ఉన్నాయని విద్యార్థులతోపాటు అధ్యాపకులు కూడా చెప్పారు.

గూడూరులో అయోమయం

గూడూరు అర్బన్, మే 5: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన నీట్‌కు హాజరైన విద్యార్థులు అయోమయానికి గురయ్యారు.పరీక్షకు సంబంధించి అందించాల్సిన ప్రశ్నపత్రం ఓ సెట్‌కు బదులు వేరేది అందజేశారు. 15 నిమిషాల తరువాత గుర్తించిన అధికారులు ప్రశ్నపత్రాలను తీసుకుని మరో సెట్‌ను ఇచ్చారు. ఈ క్రమంలో 15 నిమిషాల సమయాన్ని కోల్పోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

జనసైనికుడి ఇంటిపై దాడి

- గంజాయి మత్తులో గేటు ధ్వంసం చేసి....

అసభ్యకరంగా ప్రవర్తించిన వైసీపీ శ్రేణులు



కిషోర్‌ను పరామర్శిస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, నాయకులు - ధ్వంసమైన ఇనుప గేటు



తిరుపతి(నేరవిభాగం), మే 5: తిరుపతిలోని వెంకటరెడ్డి కాలనీ నివాసం ఉంటున్న జనసేన కార్యకర్త కిషోర్ ఇంటిపై వైసీపీకి చెందిన నాయకుడు కొడుకు జానీ, మరికొందరు మద్యం, గంజాయి సేవించి ఆదివారం రాత్రి మూకుమ్మడిగా దాడి చేశారు.ఈ దాడిలో తమ ఇంటి గేటును ధ్వంసం చేయడమేకాక,మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.'మీరు జనసేన పార్టీ తరఫున ఎలా ప్రచారం చేస్తారో మేము చూస్తాం. మీరు ప్రచారం చేస్తే మీ అంతు చూస్తాం' అని బెదిరించినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, నాయకులు హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి, తదితరులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. భయాందోళనతో ఉన్న బాధితులను ఓదార్చారు. మరోవైపు పోలీసులు వస్తున్నారని తెలియడంతో వైసీపీ శ్రేణులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈస్ట్ సీఐ మహేశ్వరరెడ్డి, పోలీసులు చేరుకోగా.. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆరణి, కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. లేకుంటే మళ్లీ వచ్చి దాడి చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తాము ప్రశాంతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంటే.. వైసీపీ శ్రేణులు మాత్రం రణరంగం సృష్టిస్తున్నాయని వారిపై గట్టిగా చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ చెప్పారు.





బోర్లు వేసే యంత్రం



మోసం గురూ!

జలకలే!

• బోర్లు వేయక.. బావురమంటున్న రైతులు ! • నామమాత్రంగా పథకం అమలు

నెల్లూరు (జడ్పీ), మే 5: జిల్లాలోని రైతులకు సాగు నీరు అందించేందుకు వైఎస్‌ఆర్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం దాన్ని హామీలకే పరిమితం చేసింది. నామ మాత్రంగానే బోర్లు వేసి చేతులు దులుపుకుంది. దీంతో ఈ పథకం లక్ష్యం నీరుగారిపోయింది. ఫలితంగా సాగునీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. మాది రైతురాజ్యం అని చెప్పుకునే జగనన్న ఇందుకు ఏమి సమాధానం చెబుతారని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

అమలు కాని హామీలు

ఐదు ఎకరాలలోపు మెట్ట ఉన్న పేద రైతులకు ఉచితంగా బోర్లు ఏర్పాటు చేసి, బీడు భూములను సాగు భూములుగా మార్చుతామని, రైతులకు అండగా నిలుస్తామని గత ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గొప్పగా హామీలిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక జలకళ పథకాన్ని నామమాత్రంగా చేపట్టారు. జగన్ మాట ఇస్తే తప్పడు... అన్న నమ్మకంతో ఈ పథకానికి రైతులు పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. గత ఐదేళ్లలో జిల్లాలో కేవలం 2,497 బోర్లు మాత్రమే వేశారు. దీన్ని బట్టి రైతుల పట్ల వైసీపీకి ఎంత చిత్తశుద్ధి అర్థమవుతోంది.

వచ్చిన దరఖాస్తులు 11,418

వైఎస్‌ఆర్ జలకళ పథకానికి, జిల్లాలో 11,418 పేద రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలో ఆ పథకం ఊసే లేదు. ఆ తర్వాత బోర్లు వేసే యంత్రాలను కొనుగోలు చేసి నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేశారు. దీంతో బోర్లు వేస్తారని దరఖాస్తు చేసుకున్న రైతులంతా ఆశగా ఎదురు చూశారు. అయితే బోర్లు ఏర్పాటుకు సవాలక్ష నిబంధనలు విధించారు. ఈ క్రమంలో మూడేళ్లలో 2,497 బోర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. బోర్లు వేయాలంటే రైతుల దరఖాస్తులను జియాలజిస్టులు పరిశీలించారు. ఆ ప్రాంతంలో నీరు పడుతుందో... లేదో? పరిశీలించి ఆమోదం తెలియచేయాలి. ఆ తర్వాత ఆమోదించిన దరఖాస్తులను ఎంపీడీవోకు పంపాలి. అక్కడ మండల అధికారులు ఆ జాబితాను ఆమోదించాలి. ఆ తర్వాత జిల్లా అధికారులకు పంపి, వారి నుంచి ఆమోదం పొందాక బోర్లు వేయాలి. అయితే మండల స్థాయి అధికారుల పరిశీలనకే దరఖాస్తులు నోచుకోలేదు. దీంతో దరఖాస్తులు భారీగా వచ్చినా బోర్లు మాత్రం నామ మాత్రంగానే వేశారు. కాగా వేసిన బోర్లకు విద్యుత్ సౌకర్యం, మోటర్ ఏర్పాటు చేయక పోవడంతో ఎక్కువ శాతం బోర్లు నిరుపయోగంగానే మిగిలిపోయాయి.

బోర్లు వేశారు.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు !



ప్రభుత్వం అట్టహాసంగా వైఎస్‌ఆర్ జలకళ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే అర్హులైన వారికి బోర్లు వేయకుండా వైసీపీ అనుచరుల పొలాల్లోనే వేశారు. ఒకవేళ ఇతరుల పొలంలో బోర్లు వేసినా విద్యుత్, పంపుసెట్ సదుపాయాలు కల్పించలేదు.

- అలపాక పెంచల ప్రశాంత్, దండిగుంట, విడవలూరు మండలం

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	దరఖాస్తులు	వేసిన బోర్లు
ఆత్మకూరు	2720	882
కందుకూరు	1762	357
కావలి	614	321
కోవూరు	102	27
నెల్లూరు రూరల్	135	1
ఉదయగిరి	3220	201
సర్వేపలి	1587	628
వెంకటగిరి (కొంతభాగం)	1278	80
	11418	2497

నిధుల దుర్వినియోగం



వైఎస్‌ఆర్ జలకళ నిధులను పాలకులు దుర్వినియోగం చేశా రు. పథకం నిర్వహణ పూర్తిగా నేతల కను సన్నల్లో అమలు చేశారు. రైతులను నిలువునా మోసం చేశారు.

- రామ్మూర్తి, విడవలూరు

పంపుసెట్ ఇవ్వలేదు...



జలకళ పథకం కింద 2021 డిసెంబరులో నా భార్య సుజాత పేరుతో బోరు, పంపుసెట్ మంజూరైంది. ఏడాదిన్నర క్రితం బోరు వేశారు. డబ్బులు కట్టి విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకున్నాం. పంపు సెట్ కోసం ఆత్మకూరు పీడీ కార్యాలయానికి పలుమార్లు తిరిగినా ఇంతవరకు ఇవ్వలేదు. ఇదేమని అడిగితే కాంట్రాక్టర్ వద్ద గోదాములో ఉన్నాయన్నారు. రేపోమాపో ఇస్తాం.. ఓపిక పట్టు.. అంటున్నారు.

- దుద్దుకూరు శేఖర్, రైతు పెగళ్లపాడు, మర్రిపాడు మండలం



ఎన్నికల్లో మెనూ..

నచ్చింది తిను !

• క్యాటరింగ్ సర్వీసులకు యమా గిరాకీ



ఎన్నికల వేళ.. కోరిన వంటకాలు వండి తీసుకొచ్చి వడ్డించే క్యాటరింగ్ సర్వీసులకు యమా గిరాకీ ఏర్పడింది. వందలాదిమంది కార్యకర్తలతోపాటు సభలు, సమావేశాలకు దండిగా జనం వస్తుండడంతో వారికి భోజనాలు ఏర్పాటు చేసేందుకు నేతలు క్యాటరింగ్ సేవలు వినియోగించుకుంటున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ప్రచారంలో తలమునకలయ్యే శ్రేణులకు బిర్యానీ, అల్పాహారం అందించేందుకు రోజూ ఆర్డర్లు ఇస్తున్నారు. చేయి తిరిగిన వంట మనుషులు చేసిన వంటకాలు మండలమంతా సరఫరా అవుతున్నాయి. కొందరైతే విందుతోపాటు మద్యం పంపిణీ చేస్తున్నారు. ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి పరిశీలిస్తే వారం రోజులుగా క్యాటరింగ్ సర్వీసులకు బాగా గిరాకీ పెరిగింది. ప్రచార సమయాల్లో ప్రత్యేకించి భోజనాలు తయారు చేయించే పరిస్థితి ఉండదు, కాబట్టి క్యాటరింగ్ వాళ్లకి ఆర్డర్లు ఇస్తున్నారు. టిఫిన్లు, భోజనం, బిర్యానీ, ఇలా అన్నింటికి కలిపి రోజుకు 500 నుంచి వెయ్యి ప్లేట్ల వరకు సిద్ధం చేసి పంపిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో ఆర్డర్లు వస్తుండడంతో సాధారణ ధరలకు బదులు కాస్త తగ్గించి ఇస్తున్నామని క్యాటరింగ్ నిర్వాహకులు చెబుతున్నారు.

- పొదలకూరు

గిరి బరిలో తొలి నారీ !

ఉదయగిరి



నామినేషన్ వేసిన అనంతరం ఎన్నికల అధికారి ఎదుట ప్రమాణం చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి పుష్పాంజలి(ఫైల్)

ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయగిరి నుంచి ఎందరో హేమాహేమీలు పోటీ చేసి, విజయం సాధించారు. అయితే ఒక్కసారి కూడా మహిళ ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన దాఖలాల్లేవు. ఏఒక్క పార్టీ కూడా వారికి అవకాశం ఇవ్వలేదు. ఈసారి జరిగే ఎన్నికల్లో మాత్రం బీఎస్పీ అభ్యర్థిగా క్రాకుటూరు పుష్పాంజలి పోటీ చేస్తున్నారు. ఆమెతోపాటు బరిలో 15 మంది ఉన్నారు. నియోజకవర్గంలో 2,41,861 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,20,108 మంది పురుషులు, 1,21,743 మంది మహిళలు ఉన్నారు. పురుషుల కంటే 1,635 మంది మహిళల ఓట్లే అత్యధికంగా ఉన్నారు. అయితే ఏ రాజకీయ పార్టీ కూడా మహిళకు టికెట్ కేటాయించలేదు. అసెంబ్లీలో ఉదయగిరి వాణిని నారీ ఎప్పుడు వినిపిస్తుందో వేచిచూడాల్సిందే.

- ఉదయగిరి



తెలివైన ఓటరు

ర్యాలీకి వస్తా.. ఓటూ వేస్తా !

ఎన్నికలవేళ గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఏపార్టీ నాయకులు పిలిచినా కొంతమంది ర్యాలీలకు, ప్రచారానికి వెళ్తున్నారు. ఇదే విషయాన్ని కొందరు నాయకులు ప్రశ్నిస్తే మా ఓటు మాత్రం మీకే వేస్తామని చెబుతున్నారు. దీంతో అభ్యర్థుల్లో అయోమ యం నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఎటువంటి ఇబ్బంది ఉండరాదన్న ఉద్దేశంతోనే కొందరు అలా చెబుతున్నట్లు తెలిసింది. టీడీపీ, వైసీపీ నాయ కులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నా రు. అభ్యర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఘనంగా స్వాగతం పలకాలన్న ఉద్దేశంతో గ్రామస్థాయి నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రచారానికి రావాలని కోరుతు న్నారు. దీంతో ఇరుపార్టీలకు జనం తండోపతండాలుగా వస్తున్నారు. దీంతో వీరు ఎవరికి ఓటు వేస్తారో అన్న అయోమయంలో పార్టీల నాయకులు, అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ తరపున ప్రచారానికి వెళ్తున్నా.. ఆ సమయంలో తమ ఓటు మేకేనని ఆ పార్టీ నాయకులకు ప్రజలు చెబుతున్నారు. ఈ క్రమంలో పోటీల్లో ఉన్న అభ్యర్థులు గ్రామాల్లోని ప్రజల నాడిని తెలుసుకునేందుకు సొంత సర్వేలు చేయించుకుంటున్నారు.

- వలేటివారిపాలెం

ఏనుగంత బలం..!



యువగళం

నా ఓటుకు ఏను గంత బలం ఉంది. ధైర్యంగా తొలి ఓటు వేస్తా. ఓటు అంటే ఐదేళ్ల పూలబాట. ఉచిత పథకాలకు ఎవరూ లొంగిపోరాదు. మాలాంటి యువత భవిష్యత్ గురించి ఆలోచించాలి. ప్రస్తుతం రంగురంగుల జెండాల మాయలో పడొద్దు. ప్రచారాలకు వచ్చిన నేతలకు ఒత్తాసు పలకొద్దు. బరితెగించి తిరుగుతున్న పాలక వర్గాలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పా లి. యువత అభివృద్ధికి పాటుపడేవారికే నా ఓటు.

- కన్నెమరకల వినయ్, మర్రిపాడు

బదిలీ పేరుతో ఓటర్ల డబుల్ ఎంట్రీ

• దొంగ ఓట్లకు పక్కా ప్లాన్ అంటూ ప్రచారం

• రెండుచోట్ల అవకాశం లేదంటున్న ఆర్వో

కావలి, మే5: కావలి నియోజకవర్గంలో దొంగ ఓట్లకు అధికార పార్టీ నేతలు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. ఇందులో భాగంగా బదిలీ ఓట్ల పేరుతో దొంగ ఓట్లను చేర్చారు. ఇందుకు అధికారులు, సిబ్బంది సహకరించారనే ప్రచారం ఉంది. కావలిలో సుమారు ఐదువేల వరకు దొంగ ఓట్లు చేర్చాలని పథకం రూపొందించగా, చివరకు రెండు వేలలోపే చేర్చినట్లు తెలుస్తోంది. ఓ ఓటును ఒక బూత్ నుంచి మరో బూత్‌కు మార్చాలంటే బీఎల్వోలు సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. ఓటు బదిలీ కావాలంటే దానికన్నా ముందు మీరు బదిలీ కోరే చిరునామాలో ఉన్నట్లు లిఖిత పూర్వక ఆధారాలు కావాలని 23వ వార్డుకు చెందిన బీఎల్వో ఒక వ్యక్తికి చెప్పారు. అదే 23వ వార్డు ప్రాంతంలో బదిలీ పేరుతో భారీగా రెండు చోట్ల ఓట్లు పొంది దొంగ ఓట్లను సిద్ధం చేశారు. ఉదాహరణకు షేక్ అఖిల్ అనే వ్యక్తి ఓటు 110 బూత్‌లో ఉంది. అయితే ఆయన బదిలీ పేరుతో అదే బూత్‌లో మరో ఇంటి అడ్రస్‌లో చేర్చు కోవాల్సిన అవసరం ఏముంది...? ఇది కేవలం అధికార పార్టీ ఒత్తిళ్లు, ఉన్నతాధికారుల సహకారంతో బీఎల్వోలు దొంగ ఓట్లు చేర్చారనే ఆరోపణలు ఉన్నాయి. బీఎల్వోలు కూడా ఎక్కువగా సచివాలయ సిబ్బందే ఉండటం, వారం తా ఆయా వార్డుల్లో వైసీపీ వార్డు ఇన్‌చార్జిలతో సఖ్యతగా ఉండడంతో వారు చెప్పినట్లు చేశారనే ఆరోపణలు ఉన్నా యి. బదిలీ ఓట్లు ఎక్కడో మారుమూల గ్రామాల నుంచి వచ్చినవి కాదు. ఎక్కువగా పట్టణంలోని వెంగళరావునగర్ ఓటర్లు అదే ప్రాంతంలో బదిలీ ఓట్లు పొందారు. అలాగే పాతూరులో ఓటర్లు అదే ప్రాంతానికే బదిలీ పెట్టుకు న్నట్లు జాబితాలో ఉన్న వివరాలను బట్టి తెలుస్తోంది. ఇవి బదిలీ ఓటర్లు అని.. ఒక చోట నుంచి మరో చోటకు బదిలీ అయిన తర్వాత రెండో చోట డిలెట్ చేసే లోపు ఎన్నికల కోడ్ వచ్చినందున వాటిని డిలిట్ చేయలేక పోయామని అధికారులు చెబుతున్నారు. అయితే డిలెట్ ఓట్ల వివరాలను పోలింగ్ కేంద్రాల్లో పీవోలకు అందచేస్తామని, ఒక వ్యక్తి రెండు పర్యాయాలు ఓటు వేసే అవకాశం లేదని వారంటున్నారు.



• రెండుచోట్ల ఓటు వేసే అవకాశంలేదు : ఆర్వో

బదిలీ పేరుతో డబుల్ ఎంట్రీ ఉన్న ఓటర్లు రెండు చోట్ల ఓటువేసే అవకాశం లేదని కావలి ఆర్వో శీనానాయక్ చెప్పారు. బీఎల్వోలు కూడా ఓటరు స్లిప్‌లు ఇంటింటికి పంపిణీ చేసేటప్పుడు బదిలీ ఓటర్లకు రెండో చోట ఉన్న ఓటు స్లిప్‌పై డిలెట్ అనిరాసి పెడ్తారని వివరించారు.

చెప్పేది వినాల్సిందే..!

హలో... నేను.. మీ నియోజకవర్గ అభ్యర్థిని. ఈ ఎన్నికల్లో మీ ఓటు తప్పనిసరిగా మా పార్టీ గుర్తుపైనే వేయాలి. అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేస్తానని ప్రమాణం చేస్తున్నా.. అంటూ పలు అంశాలపై అభ్యర్థులు ప్రసంగిస్తున్నారు. ఇది ఏ సభలోనో, రోడ్‌షోలోనో కాదు... సెల్‌ఫోన్లలో... అది కూడా ఓటర్లు ఫోన్ ఎత్తి హలో.. అనగానే అవతలి వారు ఏకబిగువున మాట్లాడేస్తున్నారు. ఆ కాల్‌ను కట్టడి చేయడానికి వీలుండటం లేదు. ఇలాంటి కాల్స్ ప్రతిరోజు పది నుంచి పదిహేను వరకు వస్తున్నాయి. వీటి పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- పొదలకూరు



అదంతే..!



ఆత్మకూరులో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ (ఫైల్)

అన్నా క్యాంటీన్లపై అక్కసు !

• ఎత్తివేసే వరకు నిద్రపోని జగన్ • పేదల కడుపులు కొట్టిన వైసీపీ

• ఇదేనా ప్రభుత్వ సంక్షేమం ?



అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం ప్రజలకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, మే 5 : ఈ రోజుల్లో ఎవరైనా రూ.5లకే కడుపునిండా అన్నం పెడతారా..? ఎంత ధనికులకైనా మనసొప్పదు.. చేతులు రావు. అలాంటిది పేదవాడి కడుపు నింపడం కోసం టీడీపీ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రాంభించింది. రుచి, శుచిగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టి అన్నార్తుల ఆకలి తీర్చింది. వైసీపీ అధికారం లోకి రాగానే అన్నా క్యాంటీన్లకు రంగులు మార్చింది. పోనీ రంగులే కదా మారిస్తే.. మార్చింది... అనుకుంటే.. వాటిని కొనసాగించకుండా మూతేసింది. గత టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు పేదలకు అతితక్కువ ధరకే రుచికరమైన భోజనం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాం టీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఆత్మకూరు నడిబొడ్డున ఉన్న మున్సిపల్ బస్టాండ్ సమీపంలో పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో అన్నకాంటీ న్‌ను ఏర్పాటు చేశారు. పట్టణానికి వివిధ పనులపై వచ్చేవారు, పలుచోట్ల పని చేసే కార్మికులు, నిరుపేదలు ఆకలితో అల్లాడిపోకుండా ఉండాలని, వారి కడుపు నింపేలా దీన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు అన్న క్యాంటీను ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రతి రోజు రెండు వేల మందికిపైగా భోజనం చేసేవారు. అలాంటిది వైసీపీ ప్రభుత్వం రాగానే అన్న క్యాంటీన్లకు మంగళం పాడింది. అన్నార్తుల కడుపులు కొట్టింది. అన్నా క్యాంటీన్ భవనం ప్రస్తుతం సచివాలయంగా రూపాంతరం చెందింది. మళ్లీ టీడీపీ ప్రభు త్వం వస్తే అన్నా క్యాంటీన్ తెరుస్తారనే ఆశతో నియోజకవర్గ ప్రజలు ఉన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు వారు సిద్ధంగా ఉన్నారు.

నిన్నో పార్టీ... నేడో పార్టీ !

• రోజుకో కండువా మార్చుతున్న చోటా నేతలు



గతనెల 26న వైసీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరిన అలీ


ఎవరు ఎప్పుడు ఎక్కడ ఉంటారో అంతుపట్టడంలేదు. నిన్న ఓ పార్టీలో చేరితే... నేడు మరో పార్టీలోకి జంప్ అవుతున్నారు. పెద్దపెద్ద నేతలకే ఈ జంపింగ్‌లు తప్పడంలేదు. ఎన్నికల సమయంలో ఇలాంటివి సర్వసా ధారణం. ఈ క్రమంలో ఉదయగిరి సినిమాహాల్ వీధికి చెందిన షేక్ అలీ అనే వ్యక్తి తనవర్గంతో గతనెల 26న వైసీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. ఇంతలో ఏమైందోఏమోకానీ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో ఆదివారం ఆయన మళ్లీ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలీకి, ఆయన అనుచరులకు కాకర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఔరా.. ఇదేమి రాజకీయం... అంటూ పట్టణ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.

- ఉదయగిరి రూరల్

జంపింగ్ జపాంగ్



ఆదివారం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీలో చేరిన అలీ



మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?

తిరుపతి - ఆంధ్రజ్యోతి

తొలిసారి గెలిచినపుడు ఎలా ఉండేవాడు.. రెండోసారి విజయం తర్వాత ఎలా మారిపోయాడు.. అనే మాటలు సూళ్లూరుపేట నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురించి వినబడుతూ ఉంటాయి. అప్పటి అమాయకత్వం, మృదుభాషణ, సౌమ్యత, వినమ్రత.. ఇవన్నీ ఏమయ్యాయి అని అందరూ ఆశ్చర్యపోతుంటారు. ఆయనలోని ఈ మార్పును తొలిగా ప్రశ్నించింది సొంతపార్టీవారే కావడం విశేషం. మాట చెప్పి మడమ తిప్పే తమ నాయకుడు జగన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకున్న కిలివేటి సంజీవయ్య సూళ్లూరుపేట నియోజకవర్గంలోనూ అదే పాటించారు. అభివృద్ధి ఇసుమంతైనా చేయకపోగా అవినీతి ఆరోపణలను లెక్కకుమిక్కిలిగా మూటగట్టుకున్నారు. సొంతపార్టీలోనే కట్టుదప్పిన శాంతిభద్రతలను దారిలో పెట్టలేక నిస్సహాయంగా చూస్తూవుండిపోయిన ఆయన సరిహద్దు నియోజకవర్గం అయిన సూళ్లూరుపేట భద్రతకు ఏమి భరోసా ఇస్తారని జనం అంటున్నారు. మూడోసారీ తనకే ఓటేయండని ఏ మొహం పెట్టుకుని అడుగుతారని ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు.



కొందరికే ప్రాధాన్యం

సంజీవయ్య రెండవ సారి గెలిచాక అక్రమార్జన గురించి తప్ప మరేమీ పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. రెడ్డి సామాజికవర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టారని, తన అక్రమార్జనకు సహకరించే కొందరిని మాత్రమే దగ్గరగా పెట్టుకున్నారని నియోజకవర్గం హోరుమంటోంది.

హామీలు మరచి.. అవినీతి పెరిగి..

మనిషే మారెనూ..

మత్స్యకారులపై నోరు జారారు

గతేడాది జూన్‌లో తడ మండలానికి చెందిన మత్స్యకారులు తమ సమస్యలు చెప్పుకుందామని తన నివాసానికి రాగా వారిని కుక్కల్లాగా మీద పడుతున్నారంటూ దూషించారు. బయటకు వెళ్ళమని గదమాయించారు. దీంతో ఆగ్రహించిన మత్స్యకారులు ఎమ్మెల్యే నివాసం ఎదుట ధర్నాకు దిగారు. ఎన్నికల్లో ఓట్ల కోసం తమ గ్రామానికి ఎలా వస్తావో చూస్తామని హెచ్చరించి వెళ్లారు.

నెల్లూరులో నివాసం.. అవస్థల్లో జనం

నాయుడుపేటలో సొంత ఇల్లు, ఇతర ఆస్తులు వున్నప్పటికీ ఎమ్మెల్యే తొలినుంచీ నెల్లూరులోనే నివాసముంటున్నారు. పనులున్న జనం, కార్యకర్తలు, ఆయన్ను వెతుక్కుంటూ నెల్లూరు వెళ్ళాల్సి వస్తోంది. ఎమ్మెల్యే కోసం నెల్లూరు వెళ్లాలంటే తడ నుంచీ 92 కిలోమీటర్లు, సూళ్ళూరుపేట నుంచీ 80 కిలోమీటర్లు, దొరవారిసత్రం, పెళ్ళకూరు మండలాల నుంచీ 77, నాయుడుపేట నుంచీ 65 కిలోమీటర్లు, ఓజిలి నుంచీ 53 కిలోమీటర్లు చొప్పున ప్రయాణించాలి. తిరుగు ప్రయాణంతో కలిపి చూస్తే తడ వాసులు 200 కిలోమీటర్లు, మిగిలిన మండలాల వాళ్ళు 110 నుంచీ 160 కిలోమీటర్లు ప్రయణించాలి. బస్సు ఛార్జీలు తడిసి మోపెడవుతాయి.



పేట ప్రజల చెవిలో సంజీవయ్య పూలు

గత ఎన్నికల ప్రచారంలో కిలివేటి సంజీవయ్య నియోజకవర్గ ప్రజలకు ఎన్నో హామీలిచ్చారు. అవి నెరవేర్చకుండానే మళ్లీ ఓటెయ్యమంటూ అడుగుతున్నారు. ఆయన ఇచ్చిన హామీల్లో కొన్ని...

హామీ: నెర్రికాలువ ఆధునికీకరణ
అమలు తీరు: దొరవారిసత్రం, సూళ్ళూరుపేట, తడ మండలాల్లోని సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరందించే నెర్రి కాలువ ఆధునికీకరణకు రూ. 27 కోట్లు మంజూరయ్యాయి. పనులు మాత్రం జరగలేదు.

హామీ: నాయుడుపేట, సూళ్లూరుపేటల్లో ఎస్ఎస్ ట్యాంకుల నిర్మాణం.
అమలు తీరు: నాయుడుపేట, సూళ్ళూరుపేటల్లో గత టీడీపీ ప్రభుత్వం మంజూరుచేసి నిర్మాణంలోవున్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల పనులు ఈ ప్రభుత్వంలో పూర్తిగా ఆగిపోయాయి. నిర్మాణ స్థలాల్లోని సామగ్రిని కూడా కాంట్రాక్టర్లు తరలించేశారు. వేసవి వచ్చిందంటే ఈ రెండు పట్టణాల్లోనూ బిందె పది రూపాయలు పెట్టి కొనుక్కోవాల్సిన దుస్థితి.

హామీ: పులికాట్‌లో పూడికతీత
అమలు తీరు: ప్రకటనలకే పరిమితం. ఎలాంటి ముందడుగూ పడలేదు.

హామీ: కాళంగి గ్రాయిన్ నిర్మాణం
అమలు తీరు: ఐదు సార్లు టెండర్లు పిలిచినా ప్రభుత్వం నుంచీ బిల్లులు రావన్న భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. పనులు కదల్లేదు. ఎమ్మెల్యే చేతులెత్తేశారు.

హామీ: ఏడాదిలో వేనాడు-పేర్నాడు తారు రోడ్డు నిర్మాణం
అమలు తీరు: ఆ ఊసే లేదు.

హామీ: విన్నమాల పంట కాలువ పూడిక తీత, ఆధునికీకరణ
అమలు తీరు: నివేదికలకే పరిమితం.

హామీ: ఆరు నెలల్లో మీజూరు వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణం
అమలు తీరు: అతీగతీ లేదు.

సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య తీరుపై భగ్గుమంటున్న జనం

అవినీతి సామ్రాట్

ఐదేళ్లూ అభివృద్ధి ఊసు లేకపోయినా అవినీతి, అక్రమార్జనల ఆరోపణల వెల్లువలో కిలివేటి నిలువునా తడిసి ముద్దయ్యారు. రాజకీయ ప్రత్యర్థులు చేసే ఆరోపణలైతే కొట్టిపారేయొచ్చు. కానీ సొంత పార్టీ నాయకులే బహిరంగ సమావేశాలు పెట్టి మరీ ఎమ్మెల్యే అవినీతి చిట్టా విప్పి చెప్పడం విశేషం. ఆయనను అడ్డుపెట్టుకుని కొందరు సన్నిహిత అనుచరులు, నాయకులు కూడా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలూ వున్నాయి. ఆరోపణల్లో మచ్చుకు కొన్ని...

- గ్రావెల్, ఇసుక, రేషన్ బియ్యం, గంజాయి వంటి వాటి అక్రమ దందాలతో సంబంధం వుందని సొంత పార్టీ నేతలే ఆరోపించారు. ఈ దందాలతో ఎమ్మెల్యే, ఆయన అనుకూల వర్గ నేతలు రూ. కోట్లు వెనకేసుకున్నారన్న ప్రచారం నడుస్తోంది.
- సెటిల్‌మెంట్లకు దిగి వాటాలు అందుకోవడం, మాట వినని వారిని బెదిరించడం చేశారన్న ఆరోపణలున్నాయి.
- స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో నామినేషన్ ఉపసంహరించుకోవాలని సూళ్ళూరుపేటలో టీడీపీకి చెందిన బీసీ నాయకుడు వెంకటసుబ్బయ్యను బెదిరించారనే ఆరోపణలున్నాయి.
- సూళ్ళూరుపేటలోని ఓ ప్రైవేటు హోటల్ స్థల వివాదంలోనూ తలదూర్చి భారీ మొత్తం వసూలు చేశారనే ప్రచారం జరిగింది.
- నాయుడుపేటలో టిడ్కో ఇళ్ళ సముదాయం వద్ద భారీ ఇసుక నిల్వలను కరిగించి రూ.2 కోట్లకు విక్రయించారని, అక్కడున్న స్టీలు, సిమెంట్ కూడా మాయం చేశారనే ఆరోపణలున్నాయి.
- పెళ్ళకూరు మండలం శిరసనంబేడు కొండలో అనుచరుల ద్వారా గ్రావెల్, మట్టి తవ్వకాలు సాగించారని, జాతీయ రహదారి కాంట్రాక్టరు సహకారంతో రూ. కోట్లు సంపాదించారనే ఆరోపణలున్నాయి.
- స్వర్ణముఖి నదిలో ఇసుకను అక్రమంగా తరలించి భారీగా వెనకేసుకున్నారనే ప్రచారముంది.
- ఇరిగేషన్ శాఖలో రూ. 70 కోట్ల వరకూ పనులు తీసుకుని కాంట్రాక్టర్ల నుంచీ భారీగా కమీషన్లు వసూలు చేశారని, పెద్దగా లాభాలు వుండవని ఆ పనులు ఆపేసినట్టు ప్రచారం జరుగుతోంది.
- నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల స్థలాల చదును పేరిట రూ. 4 కోట్లు బిల్లులు చేసుకున్నారని, వాస్తవంగా అందులో 30 శాతం కూడా ఖర్చు చేయలేదన్న ఆరోపణలున్నాయి.
- కొవిడ్ సమయంలో నాయుడుపేట సెజ్ పరిశ్రమల నుంచీ సుమారు రూ. 4 కోట్లు వసూలు చేశారని, అందులో పావు వంతు కూడా ప్రజలకు ఖర్చు చేయలేదన్న ఆరోపణలున్నాయి.
- రియల్ ఎస్టేట్ వెంచర్లకు సంబంధించి అప్రూవల్స్‌ను అడ్డుకుని వారి నుంచీ రూ. కోట్లు వసూలు చేశారని ఆరోపణలు వున్నాయి.
- ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా చివరికి సొంత పార్టీ వారైనా కూడా పోలీసులతో బెదిరించడం, కొట్టించడం వంటివి చేశారనే ఆరోపణలున్నాయి.
- ఎమ్మెల్యే వర్గంలో ప్రధాన నాయకుడైన డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని వ్యతిరేకించిన వైసీపీ నాయకుడు రాకేష్‌రెడ్డిని స్థంభానికి కట్టేసి కొట్టించారనే ఆరోపణను ఎదుర్కొంటున్నారు.

ఇదీ సంగతి



నేతల దర్శనానికి 'బ్రేక్'

తిరుమల కొండపై శ్రీవేంకటేశ్వరస్వామి వీఐపీ బ్రేక్ దర్శనమంటే గుర్తుకొచ్చేది రాజకీయ నాయకులే. మంత్రులో, ఎమ్మెల్యేలో, ఇతర పదవుల్లో కొలువుదీరేవారో సుప్రభాత వేళ సకుటుంబ పరివారంగా స్వామి దర్శనానికి బారులు తీరేవారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక రాజకీయ నాయకుల తాకిడి తగ్గిపోయింది. వీరంతా ఎవరికి వారు నియోజకవర్గ రాజకీయాలతో బిజీ అయిపోయారు. నియోజకవర్గం కదిలివెళ్లేందుకు ఎవరూ సాహసించడంలేదు. ఈలోగా ఏ పరిణామం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. ఈనేపథ్యంలోనే మార్చి నుంచే తిరుమలకు వీఐపీ నాయకుల రాక తగ్గుముఖం పట్టింది. ఏప్రిల్ రెండోవారం నుంచి వీరుకనిపించకుండా పోయారు. దీంతో వీఐపీ బ్రేక్ సమయాన్ని టీటీడీ అధికారులు తగ్గించారు. సామాన్య భక్తులంతా రెండుమూడు గంటల్లోనే స్వామిని దర్శించుకుంటున్నారు. వీఐపీ గదులు కూడా ఇప్పుడు దర్శన టికెట్ ఉంటే చాలు సులభంగా దొరుకుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రచారానికి సన్‌స్ట్రోక్



మాయదారి ఎన్నికలు మాంచి ఎండల్లో వచ్చాయి. ప్రచారం మహా కష్టంగా ఉందంటూ తెగబాధ పడిపోతున్నారు పార్టీల అభ్యర్థులు. గెలవాలి కాబట్టి మేమైతే కష్టమో నష్టమో తిరుగుతాం.. వెంటొచ్చే కార్యకర్తల,జనాల మాటేంటంటూ టెన్షన్ పడిపోతున్నారు. సమయం చూస్తే దగ్గరకొచ్చేస్తోందంటూ హైరానా పడుతున్నారు. విపరీతంగా కాస్తున్న ఎండలకు భయపడి ప్రచారానికి కార్యకర్తలు ముందుకురావడం లేదు. వచ్చినా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు... సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మాత్రమే ఉంటామంటున్నారు. మిట్టమధ్యాహ్నం తిరగడం మావల్ల కాదని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. దీంతో ఏం చేయాలో నాయకులకు పాలుపోవడం లేదు. ఉదయం, సాయంత్రం ప్రచారానికి వస్తున్న వారికి రెండు విడతలుగా రూ. 200 వంతున ఇవ్వాల్సి వస్తుందని నాయకులు లెక్కలేసుకుని తలపట్టుకుంటున్నారు. డబ్బులు కాకుండా మంచినీళ్ళ, మజ్జిగ ప్యాకెట్లూ షరామామూలే. వాస్తవంగా ఇప్పటికే బూత్‌కు రూ.3వేల నుంచి రూ.4 వేల వరకు పంపిణీ చేశారు. రెండు పూటలు డబ్బులివ్వాలనే కొత్త డిమాండ్ రావడంతో ఖర్చు తడిసిమోపెడవుతోందని పార్టీ నాయకులు గొణుక్కుంటున్నారు.

- తడ

జగన్ డోర్ డెలివరీ

- ఇంటికే రేషన్ సరుకులంటూ నాడు హామీ
- వీధిలో వాహనం దగ్గర ప్రజలకు తప్పని తిప్పలు



ఇంటికే డెలివరీ అంటూ జగన్ ప్రభుత్వం చేసిన ప్రకటన ఆచరణలో అపహాస్యం పాలైంది. అంతేకాదు రేషన్ సరుకుల్లోనూ కోతలు విధించి జనానికి నరకం చూపిస్తోంది. 2019 మ్యానిఫెస్టోలో రేషన్ సరుకులు నేరుగా ఇంటికే అందజేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా 2021 ఫిబ్రవరి నుంచి సీఎం జగన్ రేషన్ వాహనాలను ప్రారంభించారు. విజయవాడ బెంజ్ సర్కిల్‌లో పెద్ద ఎత్తున ఇందుకోసం భారీగా హడావిడి చేశారు. పది వేల రేషన్ వాహనాలను వరసగా పెట్టి మరీ ఆర్భాటం చేశారు. ఇంటికే సరుకులు వచ్చేస్తాయని సంబరపడిపోయిన జనం అసలు విధానాన్ని చూసి నీరసపడ్డారు. రేషన్ కేంద్రాల ముందుండే జనాలు ఇప్పుడు రేషన్ వాహనాల ముందు క్యూ కడుతున్నారు. డోర్ డెలివరీ చేస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం వీధిలో వాహనాన్ని నిలుపుతోంది. వీధిలో వారంతా అక్కడికే వచ్చి తీసుకోవాలని నిబంధన పెట్టింది.

● మోసం గురూ

ఇంటికి తీసుకువచ్చి ఇవ్వకుండా ఇలా వీధి చివర ఎండలో వాహనం ముందు నిలబెట్టడం కన్నా పాత పద్ధతిలో దుకాణాల్లోనే ఇవ్వచ్చు కాదా అంటూ విమర్శిస్తున్నారు. పైగా రేషన్ వాహనం రావడానికి ఓ టైం షెడ్యూలు ఉండదు. వచ్చినప్పుడే తీసుకోవాలి. ఒక వేళ పనుల్లోపడి వాహనం వద్దకు వెళ్లలేపోతే ఆ నెల రేషన్ ఉండదు. ఈ కొత్త రేషన్ పద్ధతిపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

ప్రతినెలా సరుకుల్లో కోత

హామీల్లోనే కాదు..రేషన్ సరుకుల్లోనూ వైసీపీ ప్రభుత్వం కోతలతో ప్రజలను మోసగిస్తోంది. సాధారణంగా రేషన్ సరుకుల్లో బియ్యంతో పాటు చక్కెర, గోధుమపిండి, కందిపప్పు, రాగిపిండి ఇవ్వాలి. కానీ ఈ ఐదు సరుకులు సంపూర్ణంగా ఇచ్చిన దాఖలాలు ఈ ప్రభుత్వంలో లేనే లేవని లబ్ధిదారులు వాపోతున్నారు. కేవలం బియ్యం, చక్కెరతోనే సరిపెడుతున్నారు. జిల్లాలో 6,03,000 మంది లబ్ధిదారులున్నారు. 369 వాహనాల ద్వారా వీరికి రేషన్ సరుకులు పంపిణీ చేయాలి. ప్రతినెలా 8,350 టన్నుల బియ్యం, 286 టన్నుల చక్కెర, 180 టన్నుల కందిపప్పు, 65 టన్నుల గోధుమపిండి అందించాలి. కానీ బియ్యం, చక్కెర తప్ప మిగిలిన సరుకులేవీ కనిపించవు. అడిగినా సమాధానం ఉండదు. లేదా 'ఇచ్చింది తీస్కో' అనే బుకాయింపు వినిపిస్తుంది. ఈనెల సరుకులను పరిశీలిస్తే ఆశ్చర్యపోక తప్పదు. 286 టన్నుల చక్కెరకు కేవలం 130 టన్నులు మాత్రమే జిల్లా వ్యాప్తంగా పంపారు. 180 టన్నుల కందిపప్పుకుగాను 15 టన్నులు మాత్రమే పంపారు. అంటే 165 టన్నుల కందిపప్పు పంపిణీని ఎగ్గొట్టారు. గోధుమ పిండి కూడా 55 టన్నులకే పరిమితం చేశారు.

రోడ్డు మీద నిలబెడుతున్నారు



డోర్ డెలివరీ అంటే క్యూలైన్‌లో నిలబడే బాధ తప్పిందనుకున్నాం. కార్యక్రమం ప్రారంభమైన తర్వాత కానీ అసలు విషయం తెలియలేదు. మొదట్లో రేషన్ సరుకులన్నీ ఇంటికే వచ్చి ఇస్తారనుకున్నాం. సంతోషపడ్డాం. కానీ వ్యాన్ వీధిలో ఎక్కడో చోటకు వస్తోంది. అక్కడకు వెళ్లి నిలబడాల్సి వస్తోంది. ఇంతకుముందు రేషన్ షాపుల ముందు నిలబడేవాళ్లం. అయినా నిడబడటం, నిరీక్షణ మాత్రం తప్పలేదు.

-వాటంబేడు భాస్కర్

చేతన జీవుల చేతుల నిన్న 'గుర్తు'లేవా...




ఇన్నాళ్లూ నరకం చూపించి ఇప్పుడు ఎక్కడలేని ప్రేమా ఒలకబోస్తున్న అధికార వైసీపీ నేతల తీరు చూసి ప్రభుత్వోగులు అవాక్కయ్యారు. జీతాలు పడలేదంటే నిన్నమొన్నటి వరకూ వెకిలి నవ్వులు నవ్వి తాజాగా వంగి వంగి దండాలు పెడుతుంటే విస్తుపోయారు. ఆదివారం ఎస్వీఆర్ట్స్ కళాశాల కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేందుకు వచ్చిన ప్రభుత్వోద్యోగులను ప్రసన్నం చేసుకోడానికి వైసీపీ నేతలు 'గుర్తు' చెబుతూ ఆడిన నాటకాలు అన్నీఇన్నీ కావు. మండుటెండలోనూ చెమటలు కక్కుతూ తమను ఆకర్షించేందుకు వీరు చేసిన ప్రయత్నాలను చూసి ఉద్యోగులు ముసిముసిగా నవ్వుకున్నారు.

- తిరుపతిరూరల్

వీడు మనోడేనంటావా...

ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ నియోజకవర్గ ముఖ్యనేతను అనుమానం దహించేస్తోంది. ఎవరిని నమ్మాలో..ఎవరిని నమ్మకూడదో తేల్చుకోలేకపోతున్నారు. నమ్మి పెత్తనమిస్తే కొంప ముంచుతారేమోనని సంశమిస్తున్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి మొదటి నుంచి కష్టపడిన, పట్టున్న నాయకులను పక్కన పెట్టి సొంత కోటరిని నిర్మించుకున్నాడాయన. ఏరికోరి కొత్తవారిని ఏకగ్రీవాలు చేయించుకున్నారు. ఇంకేముంది. అంతా తనవాళ్లేనని కాలర్ ఎగరేశారా ముఖ్యనేత. ఎన్నికలు సమీపించడంతో ఈమధ్య స్థానిక ప్రజాప్రతినిధులను తిరుపతికి పిలిపించుకున్నారు. ఓ హోటల్‌లో భారీ విందు ఇచ్చి బాగా పనిచేయాలన్నారు. పొగడ్తలతో ముంచెత్తారు. తర్వాతే ముఖ్యనేత అసలు స్వరూపం బయటపడింది. వీరందరినీ ఒకరికి తెలియకుండా మరొకరిని రూమ్‌లోకి పిలిపించుకున్నారు. పార్టీ పరిస్థితి, వీడిపోయేవారెవరు.. కోవర్టులున్నారా అంటూ ఆరా తీశారు. వీరంతా ఒకరిపై ఒకరు అనుమానాలను వెళ్లగక్కేసరికి ఆ పెద్ద నాయకుడు అవాక్కయ్యారు. వీరందరి గురించి విచారణ మొదలుపెట్టారు. చేసేదిలేక అందరినీ అనుమానిస్తూనే ఇప్పుడు వార్డు,గ్రామాల్లో పంపకాలు బాధ్యతలు అప్పగించారు. అయినా అనుమానం పోలేదు. కీలక పంపకాలు సరిగా చేస్తారా లేదా అని సందేహిస్తూనే ఉన్నారు.

- రేణిగుంట



ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్




గూడూరు, సూళ్లూరుపేటల్లో పోస్టల్ బ్యాలెట్ వేసిన మహిళా ఉద్యోగినులు

గూడూరు అర్బన్, మే 5: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరుకానున్న ఉద్యోగుల కోసం ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ గూడూరులో ప్రశాంతంగా జరిగింది. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఫెసిలిటేషన్ సెంటర్‌లో 7 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు. ఈ కేంద్రం వద్ద సాధారణ ఎన్నికల వాతావరణం కనిపించింది. ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చే ఉద్యోగులను టీడీపీ, వైసీపీ నాయకులు ఎవరికివారు తమ పార్టీకి ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. 2,627 ఓట్లు ఉండగా ఆదివారం 1,196 ఓట్లు పోలవడంతో 45.5శాతం ఓటింగ్ నమోదైంది. సోమవారం ఉదయం 9నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది. ఓటింగ్ వేసేందుకు వచ్చే ఉద్యోగులను వైసీపీ నాయకులు ప్రలోభాలకు గురి చేస్తున్నారని కొందరు సీవిజిల్ యాప్‌కు ఫిర్యాదు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని వైసీపీ నాయకులను తనిఖీ చేశారు. అయితే ఈ తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వెనుదిరిగారు.

వెంకటగిరిలో 69 శాతం...

వెంకటగిరి నియోజకవర్గంతో మొత్తం 1794 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గాను ఆదివారం 1240 ఓట్లు పోలైనాయి. పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు కేంద్రంలో 750 మంది మహిళా ఉద్యోగులు, 490 మంది పురుష ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 69 శాతం పోలైనట్టు అధికారులు పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు పోలింగ్ తీరును పరిశీలించారు.

సూళ్లూరుపేటలో 51.36 శాతం

సూళ్లూరుపేట పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఐదు పోలింగ్ కేంద్రాల్లో 922 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్టు ఆర్వో చంద్రముని తెలిపారు. 1795 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా 51.36 శాతం నమోదైంది. పోలింగ కేంద్రంలో వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారు. ఓటింగ్ ఆలస్యంగా సాగింది. నాయుడు పేట డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సూళ్లూరుపేట అసెంబ్లీ ఈవీఎంల కమిషనింగ్

సూళ్లూరుపేట, మే 5: సూళ్లూరుపేట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గ స్ట్రాంగ్ రూంలో ఆదివారం ఈవీఎంల కమిషనింగ్ ఆర్వో చంద్రముని ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 304 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంల బ్యాలెట్ యూనిట్‌కి, ఎన్నికల బ్యాలెట్ పేపరును సెట్ చేసేందుకు మొత్తం 44 ఏర్పాటు చేశారు. ఏఈఆర్వో గోపాలకృష్ణ బెల్ కంపెనీ ఇంజినీర్ల సాయంతో కలిసి రాజకీయ ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలో కమిషనింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీలు రాజేంద్ర, పవన్‌కుమార్, గోపినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ బదిలీ సముచితం

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణారెడ్డి

పెళ్లకూరు, మే 5: ఏపీ డీజీపీ రాజేంద్రనాథ రెడ్డి బదిలీపై టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పెళ్లకూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అధికారులు ప్రజలు మన్ననలు పొందడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అలా కాకుండా డీజీపీ అధికార పార్టీకి ఏకపక్షంగా వ్యవహరించడంతో ప్రతిపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో బదిలీ వేటు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు కందమూడి శివకుమార్, నాయకులు రాధానాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, కన్నలివాసు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం



బలిజ సంక్షేమ సంఘ నాయకుల సంఘీభావం

గూడూరు, మే 5: రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని గ్రూప్ థియేటర్ల అధినేత, బలిజ అభ్యుదయ సేవాసమితి గౌరవ అధ్యక్షుడు చదలవాడ హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం కూటమి అభ్యర్థులను గెలిపించాలని బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి కాస్మోపాలిషియన్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి జనసేన అధినేత పవన్ ఎన్డీఏ కూటమికి మద్దతు తెలపాలని కోరారన్నారు. ఈక్రమంలో బలిజ సోదరులందరూ ఎన్డీఏ కూటమి మద్దతుగా నిలవాలన్నారు. కూటమి నుంచి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పాశిం సునీల్‌కుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థిగా వరప్రసాదరావు పోటీ చేస్తున్నారని వారి విజయానికి అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో మునిగిరీష్, టి.చంద్రశేఖర్, చంద్రనీల్, ఇంద్రవర్ధన్, వి.శివకుమార్, మోహన్, ఎం.వీ.రమణయ్య. పి.వెంకటేశ్వరరావు, బి.మురళి, సిద్దయ్యనాయుడు, రమేష్, నటశేఖర్, భాస్కర్, పూర్ణచంద్రరావు, పి.విజయ, ఇండ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట

వెంకటగిరి, మే 5: కాపుల సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట వేస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక మదరకాడమీ కల్యాణ మండపంలో కాపులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి రాగానే కాపు భవనాలను నిర్మిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు కాపు నాయకులు వెంకటగిరిలో కురుగొండ్ల రామకృష్ణను, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించుకుంటామని ప్రతిజ్ఞచేశారు. కాపు నాయకులు దాసరి రాము, ఊకా విజయకుమార్, చదలవాడ సుచరిత, కరుణానిధి, తోట కృష్ణయ్య, బి.రాజేశ్వరరావు, కోనా వెంకటేశ్వర్లు, జి.మురళి, చాగంపూడి కృష్ణయ్య తదితరులు వున్నారు.



కాపుల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, మే 5: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువైవున్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు.

కోటమ్మకు ప్రత్యేక పూజలు

కోట, మే 5: కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణ చేపట్టారు. పరిసర మండలాల భక్తులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

దుష్టపాలకును గద్దెదించుదాం

చిల్లకూరు, మే 5: రాష్ట్రంలో దుష్టపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించుదామని జనసేన ఉమ్మడి నెల్లూరుజిల్లా ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ అన్నారు.గుమ్మళ్లదిబ్బలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహిం చారు. మత్స్యకారుల సంక్షేమాన్ని మరిచి పాలన సాగిస్తోందన్నారు. కూటమి అభ్యర్థులు పాశిం సునీల్ కుమార్, వరప్రసాద రావును గెలి పించుకోవాలన్నారు.మనోజ్‌కుమార్, కార్తీక్, మహేష్, రాములు, సుధీర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరుడైన జగన్‌కు మళ్లీ అధికారం ఇవ్వొద్దు

● తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెలగపల్లి వరప్రసాద రావు - బలిజ సంఘ నాయకులతో సమావేశమైన వరప్రసాద్

సూళ్లూరుపేట/వెంకటగిరి/శ్రీకాళహస్తి, మే 5: అవినీతి పరుడైన సీఎం జగన్ ప్రజాస్వామ్యంలో ఉండకూడదని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. ఆదివారం సూళ్లూరుపేటలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం జగన్ కుట్రలు, కుతంత్రాలతో రాష్ట్రాన్ని రావణకాష్టంగా చేశాడన్నారు. వ్యవస్థలు సర్వనాశనమై పోయాయని ఇవన్నీ చక్కబడి రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే సీఎంగా చంద్రబాబుని గెలిపించాలని కోరారు. పేదలకు పించన్ అందకుండా చేస్తున్న జగన్‌ను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇవన్నీ చాలక ఇప్పుడు రైతుల పొలాలపై పడ్డాడని అటువంటి జగన్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే నేటికీ కనబడుతోందే తప్ప గత ఐదేళ్లల్లో నయాపైసా పని జరగలేదని విమర్శించారు. టీడీపీ నాయకులు వేనాటి సతీష్‌రెడ్డి, చిట్టేటి పేరుమాల్, బుద్ది విజయలక్ష్మి, జనసేన నాయకుడు రమణ, వల్లూరు రాజా తదితరులు పాల్గొన్నారు.

కాపు సోదరులతో ఆత్మీయ సమావేశం...

వెంకటగిరిలోని ఎస్ఆర్‌గార్డెన్, శ్రీకాళహస్తిలోని మహేష్ కల్యాణ మండపాల్లో ఆదివారం బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వరప్రసాదరావు హాజరయ్యారు. జనసేన అధినేత పవన్ నిస్వార్థంగా రాజకీయాల్లోకి వచ్చారని, అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. తనకు చిరంజీవి కుటుంబంతో మొదటి నుంచీ మంచి సంబంధాలు ఉన్నాయని, అందుకే 2009లో తాను ప్రజారాజ్యంలో పని చేశానని గుర్తుచేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జనసేన నాయకుడు కోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు: నెలవల విజయశ్రీ




అరవపెరిమిడిలో ప్రచారం నిర్వహిస్తున్న విజయశ్రీ, పరసారత్నం- పూడేరు వద్ద విజయశ్రీకి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

నాయుడుపేట/టౌన్, దొరవారిసత్రం, మే 5: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం 20 ఏళ్లు వెనకబడిందని టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం దొరవారిసత్రం మండలం సింగనాలత్తూరు పంచాయతీలో మాజీ మంత్రి పరసారత్నంతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వారికి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ఐదేళ్లల్లో రాష్ట్రంలో అరాచక శక్తులు పెట్రేగిపోయాయన్నారు. వైసీపీ నాయకులు అక్రమ దందాలతో రాష్ట్రాన్ని దోచుకు న్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఆపార్టీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నాయుడు పేట మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ఎం.శోభారాణి, మండల అధ్యక్షుడు వి.శ్రీనివాసనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి బాబునాయుడు, నాయకులు జక్కరయ్య, షబ్బీర్, శ్రీహరిరెడ్డి, పామంజి శ్రీనివాసులు, మురళీరెడ్డి, రాధాకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి దిశ... దశ చంద్రబాబుతోనే

రాష్ట్రానికి దిశ... దశ చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని మాజీ మంత్రి పరసారత్నం, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. అరవపెరిమిడి, పూడేరు, రామారెడ్డికండ్రిగ, నరసారెడ్డికండ్రిగ, పెరికలంపాటి కండ్రిగ, కమ్మవారిపాళెంలలో టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీతో కలసి ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని తిరిగి గాడిలో పడాలంటే అనుభవజ్ఞుడైన చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి అభ్యర్థులైన తిరుపతి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీని గెలిపించాలని కోరారు. శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, బీజేపీ సీనియర్ నేత ఎస్.దయాకర్ రెడ్డి, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మైలారి రాజశేఖర్, శ్రీరామ్ ప్రసాద్, ఎ.మాధవ రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ శోభారాణి, డి.రాజేంద్ర, బీజేపీ నాయకులు రామయ్య, ఎ.వీ.ఎస్.రవీంద్ర, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సింగనాలత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న విజయశ్రీ

టీడీపీలోకి పెరుగుతున్న చేరికలు




చింతగుంటకు చెందిన వైసీపీ నాయకులకు టీడీపీ కండువాలు కప్పుతున్న కురుగొండ్ల - పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మతపెద్దలు

వెంకటగిరి, డక్కిలి, మే 5: వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. మొన్నటి వరకు వైసీపీ జెండాలు మోసిన నాయకులు ఉన్నట్టుండి టీడీపీ కండువాలు కప్పుకోవడంతో శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఆదివారం టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె, నియోజకవర్గ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ ఆధ్వర్యంలో 130 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వెంకటగిరి మండలంలోని చింతగుంటకు చెందిన వైసీపీ నాయకులు కె.కోటేశ్వరావు ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే కురగొండ్ల రామకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. చెలికంపాటు హరిజనవాడకు చెందిన పి.వెంకటసుబ్బయ్య, కరకానంబేడు నరసింహులు, మునిచెంద్ర సహా వారి అనుచరులు, 40 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ మండల అధ్యక్షుడు పి.చంద్రమౌళిరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీ సాయిప్రియ సమక్షంలో పార్టీలో చేరారు. డక్కిలి మండలం మార్లగుంటకు చెందిన లైటింగ్ చంద్ర, ఎన్.పాలనేత్రా, ఎన్.భద్రయ్య, ఎస్సీ నాయకులు ఏ.ప్రసాద్, టి.భాస్కర్, పి.అంకయ్య అనుచరులు, 30 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు డక్కిలి మండల పార్టీ అధ్యక్షుడు పి.కోటేశ్వరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ.రామచంద్రయ్య, నాయకులు సుప్తాని విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇంకా 5, 9, 23 వార్డులకు చెందిన వైసీపీ నాయకులు 49 మంది తెలుగుయువత నాయకుడు షేక్ అల్తాఫ్ ఆధ్వర్యంలో లక్ష్మీసాయి ప్రియ సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం వెంకటగిరి పట్టణంలోని ముస్లిం మత పెద్దలు ఆదివారం పార్టీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆయన్ను ఆశీర్వదించారు.




వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మీ సాయిప్రియ - డక్కిలి మండల వైసీపీ నాయకులనుకండువాలతో పార్టీలోకి ఆహ్వానిస్తున్న కురుగొండ్ల

టీడీపీ గెలుపునకు శుభసూచకం: కురుగొండ్ల

వెంకటగిరి/ డక్కిలి, మే 5: తనకు కలిసి వచ్చిన 5వ తేది పోస్టల్ బ్యాలెట్ జరగడం గెలుపునకు శుభసూచకమని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్‌ను సీఎం జగన్ తనకు అనుకూలంగా మలుచుకొనేందుకు ప్రయత్నించినా ఆయన పప్పులు ఉద్యోగుల వద్ద ఉడక లేదన్నారు. తమను అన్ని విధాలా ఇబ్బంది పెట్టిన సీఎంకు బుద్ధి చెప్పేందుకు సమాయత్తమయ్యారన్నారు. పోలింగ్ సరళి టీడీపీ అనుకూలంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే రామరాజ్యం



కోట, మే 5: అప్పులు, అరాచకంతో కూరుకుపోయిన ఆంధ్రాలో మరో కొద్ది రోజుల్లో టీడీపీ అధినేత చంద్రబాబుతో రామరాజ్యం రానున్నదని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. గూడలి, దక్షిణపాళెం, రాజుపాళెంలలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే సంవత్సరానికి ఉచితంగా మూడు సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌ను, ఎంపీ అభ్యర్థిగా వరప్రసాద్‌ను గెలిపించాలని కోరా రు. గూడలి పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు, వార్డు మెంబర్లు ఉన్నారు.

కేంద్రం నిధులతో జగన్ సోకులు

చిట్టమూరు, మే 5 : రాష్ట్రానికి ప్రధాని నరేంద్రమోడీ నిధులు ఇస్తే సీఎం జగన్ సోకులు చేసుకున్నారని గూడూరు నియోజకవర్గ బీజేపీ పరిశీలకుడు శ్రీనివాసయాదవ్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో కేంద్రం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యాన్ని తాను ఇచ్చినట్టుగా జగన్ ప్రచారం చేసుకున్నాడన్నారు. ఆరోగ్యశ్రీ, అంగనవాడీకి వచ్చే సరుకులు, సచివాలయాలు, రైతు భరోసాలు కట్టిన నిధులు ప్రతి పైసా కేంద్రం ఇచ్చిందేనన్నారు.

ప్రశాంతంగా నీట్

తడ, మే 5: నీట్ ప్రశాతంగా జరిగింది. మండలంలోని పులివేంద్ర సమీపంలో ఉన్న పద్మావతి విద్యాలయంలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 242 మంది విద్యార్థులకుగాను 229 మంది హాజరయ్యారు. శిక్షణ ఎస్పీ దేవరాజ్ పాటిల్, ఎస్ఐ నరసింహరావు బందోబస్తు పర్యవేక్షించారు.

కూటమితోనే జనరంజక పాలన: పాశిం




రావిగుంటపాళెంలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ - నిడిగుర్తిలో విజయరత్నంను కండువాకప్పి స్వాగతిస్తున్న పాశిం

వాకాడు, మే 5: కూటమితోనే జనరంజక పాలన సాధ్యమని గూడూరు నియోజవకర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని రావిగుంటపాళెం, నిడిగుర్తి, మూలపడవ, పూడిరాయిదొరవు పంచాయతీల్లో కూటమి నాయకులతో ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని, కూటమి మేనిఫెస్టోతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారం చేపట్టిన సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. గూడూరులో టీడీపీని గెలిపించుకుంటే నియోజకవర్గం నెల్లూరుజిల్లాలో చేరుతుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే తొలి సంతరం మెగా డీఎస్సీ పైన, రెండో సంతకం ల్యాండ్‌టైటలింగ్ రద్దుపై పెడుతారన్నారు. ఒక ఓటు సైకిల్‌కు, మరో ఓటు కమలంపువ్వుపై వేయాలని అభ్యర్థించారు.

280 కుటుంబాల టీడీపీలో చేరిక....

నిడిగుర్తి పంచాయతీలో కె.విజయరత్నం, పూడిరాయిదొరవు పంచాయతీలో ఎ.రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 280 కుటుంబాల వారు పాశిం సునీల్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎన్.జగన్మోహన్‌రెడ్డి, శివకోటారెడ్డి, డి.మధుసూదన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, పి.పురుషోత్తంరెడ్డి, బి.ప్రమీల, చిరంజీవమ్మ, చరణ్‌రెడ్డి, రమణయ్య, భుజగేంద్ర, సంపత్‌కుమార్, ధనుంజయ, సునీత, కృష్ణమూర్తి, కవిత, కోట శ్రీనివాసులు, పి.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి...

గూడూరు, మే 5: రాష్ట్రంలో రాక్షసపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో గద్దెదించాలని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. ఆదివారం దివిపాళెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలు, దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించేవారు కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అందరం కష్టపడి రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ విజయానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో పిట్టి నాగరాజు, రమణయ్య, నరేష్, వెంకటేశ్వర్లు, జిక్కిరాజు, శ్రీనివాసులు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, వాసు తదితరులు పాల్గొన్నారు.



దివిపాళెంలో ప్రచారం నిర్వహిస్తున్న సంధ్యారాణి